teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 78 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | బుధవారం | 10 జూలై 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం బంఫర్ ఆఫర్

**ప్రభుత్వం తరపున ఉద్యోగం, ఇంటి స్థలం ఇవ్వాలని నిర్ణయం**

హైదరాబాద్, జూలై 09 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌కు చెందిన టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు తెలంగాణ ప్రభుత్వం బంఫర్ ఆఫర్ ఇచ్చింది. గత నెల వెస్టిండీస్, అమెరికా వేదికగా జరిగిన టీ-20 వరల్డ్ కప్ టైటిల్ గెలిచి టీమిండియా ఈ జట్టులో సభ్యుడైన ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగం, ఇంటి



మిగతా 2 లో



## ఓయూలో రాత్రంతా డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

**అభ్యర్థుల అరెస్ట్ తో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తత**

**కాంగ్రెస్ సర్కారుపై మండిపడుతున్న డీఎస్సీ అభ్యర్థులు**

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలని డీఎస్సీ అభ్యర్థులు ఉస్మానియా యూనివర్సిటీలో రాత్రంతా ఆందోళన చేపట్టారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అభ్యర్థుల వెంటపడి మరీ పోలీసులు అరెస్ట్ చేసి ఈడ్చుకెళ్లారు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు పునరావృతం అయినట్లు కనిపిస్తున్నాయని కాంగ్రెస్ సర్కారుపై డీఎస్సీ అభ్యర్థులు మండిపడుతున్నారు.



.. వివరాలు 2లో

# బీఆర్ఎస్‌పై పునరాలోచన

**2దశాబ్దాలుగా కలిసొచ్చిన "టీఆర్ఎస్" పేరుపై ఆసక్తి**

**బీఆర్ఎస్ పేరుతో గ్యాప్ వచ్చినట్లు భావిస్తున్నట్లు సమాచారం**



జాతీయ స్థాయిలో రాజకీయాలంటూ టీఆర్ఎస్ పార్టీ పేరు మార్చుకొని బీఆర్ఎస్ గా మారిన గులాబీ పార్టీ మునుపటి పేరుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. గత అసెంబ్లీ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి పేరిట ఎన్నికలకు వెళ్లిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. 39 ఎమ్మెల్యే సీట్లు గెలిచి ప్రతిపక్షానికి పరిమితమైంది. ఇందులో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత ఓటమి ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ కు చెందిన శ్రీగణేశ్ గెలుపుతో బీఆర్ఎస్ బలం కాస్తా 38కి పడిపోయింది.

తెలంగాణ బ్యూరో, జూలై 09 (తీన్మార్ న్యూస్): తర్వాత జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడం 15 చోట్ల మూడోస్థానానికి పడిపోవడం చాలా స్థానాల్లో డిపాజిట్లు కోల్పోవడంతో కారు పార్టీ ఉక్కిరి బిక్కిరయ్యింది. గెలిచిన ఎమ్మెల్యేల్లో ఇప్పటి వరకు ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే ఆరుగురు ఎమ్మెల్సీలు కూడా హస్తం పార్టీలో చేరారు. వరుస వలసలు గులాబీ అధినేతకు కంటిమీద కనుకు లేకుండా చేస్తున్నాయి. ఇవాళ

మిగతా 2 లో






## హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ కాలయాపన

ఒక్కొక్క మహిళలకు రూ. 20 వేల బాకీ అంటూ కిషన్ రెడ్డి ఆరోపనలు

రేవంత్ సర్కార్ పై ధ్వజమెత్తిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

.. వివరాలు 2లో



## సీఎం రేవంత్ రెడ్డిపై ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఫైర్

మెగా డీఎస్సీ ఎక్కడ..

ముఖ్యమంత్రి గారు అంటూ ప్రశ్నలు

ఇచ్చిన మాట ఏమైందంటూ నిలదీత

.. వివరాలు 2లో



## అంగన్వాడీల్లో నాణ్యత లేని గుడ్ల పంపిణీపై సీతక్క సీరియస్

**నాసిరకం వస్తువులు సరఫరా చేసే వారిపై చర్యలకు ఆదేశాలు**

హైదరాబాద్, జులై 09 (తీన్మార్ న్యూస్): అంగన్వాడీల్లో నాణ్యత లేని గుడ్ల పంపిణీపై సీరియస్ అయిన మంత్రి సీతక్క నాసిరకం వస్తువులు సరఫరా చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డా. బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలపై

మిగతా 2 లో

## గొర్రెల స్కాం దర్యాప్తులో ఏసీబీ దూకుడు

**పంపిణీపై వివరాలకు అభివృద్ధి సహకార సమాఖ్యకు లేఖ**

**ఇప్పటికే గొర్రెల స్కాంపై ఈడీ కేసు నమోదు**

తెలంగాణ బ్యూరో, జులై 09 (తీన్మార్ న్యూస్): గొర్రెల స్కాం దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. గొర్రెల పంపిణీపై వివరాలు కావాలని తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్యకు లేఖ రాసింది. ఆ లేఖలో లబ్ధిదారులు, అమ్మకందారుడి వివరాలు, బ్యాంక్ అకౌంట్లు, డేటా ఆఫ్ గ్రౌండింగ్,ట్రాన్స్ పోర్ట్, ఇన్ వాయిస్‌లతో కూడా డేటా కావాలని ఆదేశించింది. ఇప్పటికే గొర్రెల స్కాంపై ఈడీ కేసు నమోదు చేసింది. స్కీంకు సంబంధించిన సమగ్ర నివేదిక కావాలని కోరింది. అయితే ఇప్పటివరకు ఈడీకి

మిగతా 2 లో




## కాలేజ్ క్యాంటీన్ చట్నీలో ఎలుక

**ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి ఆగ్రహం వ్యక్తం**

సంగారెడ్డి, జులై 09 (తీన్మార్ న్యూస్): సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ కాలేజ్ క్యాంటీన్‌లో చట్నీలో ఎలుక వచ్చిన ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జేఎన్టీయూలో జరిగిన



మిగతా 2 లో



## ఆలయంలో తోపులాటపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

**ఘటన వెనుక కుట్ర కోణం దాగి ఉందని అనుమానం వ్యక్తం**

హైదరాబాద్, జూలై 09 (తీన్మార్ న్యూస్): బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం సందర్భంగా ఆలయంలో చోటు చేసుకున్న తోపులాటపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఘటన వెనుక కుట్ర కోణం దాగి ఉందని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖ దీనిపై దర్యాప్తు చేస్తుందని తెలిపారు. కాగా, బల్కంపేట్ ఎల్లమ్మ టెంపుల్‌లో

మిగతా 2 లో

## 2 రోజుల్లో విడుదలకానున్న రుణ మాఫీ విధివిధానాలు

**ఆగస్ట్ 15లోపు రుణమాఫీ చేస్తాం**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసులరెడ్డి వెల్లడి**



హైదరాబాద్, జులై 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు రాష్ట్ర సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 2024, ఆగస్ట్ 15వ తేదీలోపు బ్యాంకుల్లోని రైతు ఖాతాల్లో 2 లక్షల రూపాయల అప్పు మాఫీకి సంబంధించి మంత్రి పొంగులేటి

మిగతా 2 లో

## డీఎస్సీ పరీక్షల వాయిదాపై స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

**ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్నట్లు వెల్లడి**

తెలంగాణ బ్యూరో, జులై 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని ఉద్యోగార్థులు కోరుతున్న వేళ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ జులై 8న ప్రకటన




మిగతా 2 లో

## 14 రకాల "పతంజలి" ఉత్పత్తుల అమ్మకాల రద్దు

**సుప్రీం కోర్టుకు వెల్లడించిన పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్**

న్యూ ఢిల్లీ, జులై 09 (తీన్మార్ న్యూస్): లైసెన్స్ రద్దు అయిన 14 రకాల ఉత్పత్తుల అమ్మకాలను ఆపేశామని పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సుప్రీం కోర్టుకు వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉత్తరఖండ్ ప్రభుత్వం పతంజలి ఉత్పత్తుల లైసెన్స్‌లు రద్దు



మిగతా 2 లో

## బీఆర్ఎస్‌పై పునరాలోచన




**మొదటి పేజీ తరువాయి**

తనతో సమావేశానికి హాజరైన వారు తెల్లారేసరికి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతుండడాన్ని గులాబీ బాస్ జీర్ణించుకోలేక పోతున్నారట. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా కలిసొచ్చిన టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చడం ద్వారా ప్రజలతో గ్యాప్ ఏర్పడిందని పార్టీ నాయకత్వం భావిస్తున్నదని సమాచారం. మంగళవారం ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలోనూ మాజీ మంత్రి కేటీఆర్ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన టీఆర్ఎస్ మళ్లీ సెంటిమెంట్ రగిలించాలనే ఆలోచనతో ఉన్నట్టు తెలుస్తోంది. ప్రజలతో ఏర్పడ్డ గ్యాప్ ను ఫిల్ చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్టు సమాచారం. ఇదిలా ఉండగా ప్రజలకు విశ్వాసం కల్పించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాదయాత్ర చేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.

తాము చేసిన అభివృద్ధి కన్నా సెంటిమెంటే విజయతీరాలకు నడిపిస్తుందని గులాబీబాస్ గట్టిగా నమ్ముతున్నారని సమాచారం. బీఆర్ఎస్ ను టీఆర్ఎస్ గా మార్చడం ప్రజలు పార్టీని ఓన్ చేసుకుంటారని కేసీఆర్ అనుకుంటున్నారని తెలుస్తోంది. విభజన అంశాలను, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను తెరమీదకు తెచ్చి పార్టీని ప్రజల్లో ఉంచేందుకు టీఆర్ఎస్ గా మార్చడమే ఏకైక పరిష్కారమని భావిస్తున్నట్టు తెలుస్తోంది.

## సీఎం రేవంత్ రెడ్డిపై ట్విట్టర్ వేదికగా కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, జులై 09 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డిపై ట్విట్టర్ లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. మెగా డీఎస్సీ ఎక్కడ.. ముఖ్యమంత్రి అంటూ ప్రశ్నించారు. తొలి క్యాబినెట్ లోనే 25 వేలతో మెగా డీఎస్సీ అని మీరిచ్చిన మాట ఏమైంది.. అంటూ నిలదీశారు. తొమ్మిది నెలలు కావస్తున్నా లక్షలాది మంది డీఎస్సీ అభ్యర్థుల ఆక్రందన, మీ కాంగ్రెస్ సర్కారుకు వినపడటం లేదా? మీరు కొలువుదీరితే సరిపోతుందా? యువతకు కొలువులు అక్కర్లేదా ?? గతంలో మీరు ఉస్మానియా విద్యార్థులు అడ్డమీద కూలీల్లాంటి వారని ఎగతాళి చేశారు. తిన్నది అరిగేదాకా అరిచే బీరు బిర్యానీ బ్యాచ్ అని బద్నాం చేశారు. సిద్ధాంతం, ఆలోచన లేని ఆవారా టీమ్ అని అవహేళన చేశారు అంటూ సీఎం రేవంత్‌పై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక నేడు అదే ఉస్మానియా యూనివర్సిటీని రణరంగంగా మార్చారు. డీఎస్సీ అభ్యర్థులపై పోలీసులను ప్రయోగించి అణచివేస్తున్నారు. వందల మందిని అన్యాయంగా అరెస్టుచేసి అక్రమ కేసులు పెడుతున్నారు. కనీసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కూడా కాలరాస్తున్నారు అని కేటీఆర్ అన్నారు. గుర్తు పెట్టుకోండి ఉస్మానియా విశ్వవిద్యాలయం దేశ సరిహద్దుల్లో లేదు. మరెందుకు ఇన్ని బలగాలు, ఎందుకు ఇంతటి నిర్బంధం, మళ్లీ ఉద్యమం నాటి పరిస్థితులను ఎందుకు కల్పిస్తున్నారు. నిత్యం పోలీసుల బూట్లచప్పుళ్లతో ఎందుకు కలవరపెడుతున్నరు. డీఎస్సీ అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## గొర్రెల స్కాం దర్యాప్తులో ఏసీబీ దూకుడు




**మొదటి పేజీ తరువాయి**

నివేదిక అందలేదని తెలుస్తోంది. ఈడీ,ఏసీబీ లేఖలతో తలలు పట్టుకోవడం అధికారుల వంతైంది. దర్యాప్తు సంస్థల ఆదేశాలతో అధికారులు గొర్రెల స్కాంకు సంబంధించి వివరాల్ని సేకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయా జిల్లాల వారీగా కలెక్టర్లకు లేఖలు రాస్తున్నారు.

**రూ.1000 కోట్ల అక్రమాలు**

రాష్ట్రవ్యాప్తంగా గొర్రెల పంపిణీలో రూ.1000 కోట్ల అక్రమాలు జరిగినట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. గొర్రెల పంపిణీలో భాగంగా మనీ లాండరింగ్ కోణంపై ఈడీ దర్యాప్తు చేయనుంది. జిల్లాల వారీగా లబ్ధిదారుల పేర్లు, వారి చిరునామాలు, ఫోన్ నంబర్లు, బ్యాంకు ఖాతాల వివరాలు తదితర సమాచారం ఇవ్వాలని ఈడీ కోరింది.

## కాలేజ్ క్యాంటీన్ చట్నీలో ఎలుక





**మొదటి పేజీ తరువాయి**

ఘటనపై తక్షణం విచారణ చేపట్టాలని సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్, స్థానిక ఆర్డీఓ, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. విచారణ చేపట్టి వెంటనే నివేదికను సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులకు సూచించారు. అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో, కళాశాల్లో ఉన్న బోర్డింగ్, హాస్టళ్లను, క్యాంటీన్లను తనిఖీలు నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలను తయారు చేసే నిర్వాహకులు ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ను తీసుకోవాలని మంత్రి కోరారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించని సంస్థల లైసెన్సులను వెంటనే రద్దు చేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిరంతరం హోటల్స్, రెస్టారెంట్స్ తో పాటు బేకరీలు, బోర్డింగ్, హాస్టల్స్, క్యాంటీన్లు, ఆహార పదార్థాలు తయారు చేసే నిర్వాహకుల పై నిఘా ఉంచాలని మంత్రి అధికారాన్ని ఆదేశించారు.

# ఓయూలో రాత్రంతా డీఎస్సీ అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, జూలై 09 (తీన్మార్ న్యూస్): తెలంగాణ బిడ్డలకు ఎన్నికల ముందు ఆశలు చూపి అధికారంలోనివచ్చిన మరుక్షణం నుండే అణచివేతకు పాల్పడుతున్న రేవంత్ సర్కార్ మీద నిరుద్యోగ యువత భగ్గుమంటుంది. ఇందిరమ్మ రాజ్యంలో ఇబ్బందులు ఉండవని చెప్పి మహిళలను అర్ధరాత్రి రోడ్డు మీదకు ఈడ్చిండని తెలంగాణ సర్కారుపై అభ్యర్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు 2 లక్షల కొలువులు ఇస్తామని చెప్పి అర్ధ రాత్రి రోడ్ల మీద కూర్చోవడమే కొలువులా.. ఏమాయే ఎన్నికలలో ఇచ్చిన హామీలంటూ గొంతెత్తి ప్రశ్నించారు. ఇదీ కాంగ్రెస్ మా నిరుద్యోగులకు ఇస్తున్న బహుమానం అంటూ ఎమోషనల్ అయ్యారు. అర్ధ రాత్రి పూట మహిళలు మాకు చదువుకోడానికి సమయం ఇవ్వమని అడుగుతున్నారంటే అసలు మీ దౌర్భాగ్యపు పాలన ఎలా ఉందో చెప్తుందని ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నిరుద్యోగులు అందరం తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మమ్మల్ని ఇలా అర్ధరాత్రి రోడ్డు మీద నిలబెట్టడం సిగ్గుచేటని అన్నారు. డీఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా బీఆర్ఎస్ నేత రాకేష్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ వద్దకు చేరుకున్నారు.





## హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ కాలయాపన

హైదరాబాద్, జులై 09 (తీన్మార్ న్యూస్): ఇచ్చిన ఏ ఒక్క హామినీ అమలు చేయకుండా దేవుళ్ళ మీద ఒట్లు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాలయాపన చేస్తున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. అధికారంలోకి రాకముందు పెద్ద పెద్ద పొంకణాలు కొట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్నా సీఎం ఎక్కడున్నారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామన్న సోనియా గాంధీ ఎటుపోయారు ఆమె రాసిన లెటర్ ఎటు పోయిందని విమర్శించారు. మంగళవారం హైదరాబాద్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా మంత్రి లేకుండా కేసీఆర్ పరిపాలన సాగించి ఖ్యాతికెక్కితే నాటి నుంచి నేటి వరకు మాటకు కట్టుబడే చరిత్ర కాంగ్రెస్ కు లేదని ఎద్దేవా చేశారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానిదన్నారు. రాష్ట్ర చట్టసభలో 40 స్థానాల్లో మహిళలు ఉండాలని కోరుకుంటున్నానన్నారు.



**నిద్రపోయి కలలు కనమంటున్నారా?:**

రాష్ట్రంలోని మహిళలకు ప్రతి నెల రూ.2500 ఇస్తామన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు వారికి రూ. 20 వేల బాకీ ఉందన్నారు. వృద్ధులకు రూ.4 వేల పింఛన్లు ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. అమలు కాని హామీలిచ్చి ప్రజలను నిలువునా ముంచారని ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణిస్తూ హాయిగా నిద్రపోండి. ఆ నిద్రలో కలలు కంటూ మహిళలకు ఇస్తామన్న రూ.2500, స్కూటీ ఇచ్చినట్లు కలలు కనండి అనేలా రేవంత్ రెడ్డి వ్యవహారం నడుస్తున్నదన్నారు. ఉచిత బస్సు స్కీమ్ పెట్టి గ్రామీణ ప్రాంతాల్లో సగానికి పైగా బస్సు సర్వీసులు తగ్గించారని ధ్వజమెత్తారు. భయపెట్టి ఆర్ఆర్ ట్యాక్స్ లను వసూలు చేస్తూ రేవంత్ రెడ్డి తెలంగాణను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. గడిచిన ఏడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పథకాల పేరుతో వేల కోట్ల అప్పులు తెచ్చిందని అప్పుల విషయంలో కేసీఆర్ బాటలోనే కాంగ్రెస్ వెళ్తోందని విమర్శించారు. బెల్ట్ షాపులు రద్దు చేస్తామన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగాయని డ్రగ్స్ నిర్మూలన మీద హడావుడి చేస్తున్న రేవంత్ రెడ్డి బెల్ట్ షాపులను ఎందుకు నిలువరించలేకపోతున్నారని ప్రశ్నించారు. బెల్ట్ షాపులు పేరు మీద పేద ప్రజల రక్తాన్ని తాగుతున్నారని ధ్వజమెత్తారు.

**తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడానికి నొప్పెందుకు?:**

బంగారు తెలంగాణలో రేషన్ కార్డులు ఇచ్చుకోలేని దౌర్భాగ్య పరిస్థితుల్లో ఉన్నామని, కేసీఆర్ రేషన్ కార్డులు ఇవ్వలేదని ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే బాటలో వెళుతున్నారన్నారు. తెల్ల రేషన్ కార్డులు ఇవ్వడానికి రేవంత్ రెడ్డికి నొప్పేందుకని నిలదీశారు. కేంద్ర పథకాలు ప్రతి పేద వారికి అందాలంటే తెల్ల రేషన్ కార్డు కావాలన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు నెరవేర్చేలా సీఎంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. అందుకు మహిళా మోర్చ ఆధ్వర్యంలో భవిష్యత్ పోరాటాలు చేపడతామన్నారు.

## క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం బంఫర్ ఆఫర్

**మొదటి పేజీ తరువాయి**

స్థలం ఇవ్వాలని తెలంగాణ సర్కార్ నిర్ణయించింది. ఈ మేరకు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో లేదా చుట్టుపక్కల ప్రాంతాల్లో అందుకు అనువైన ఇంటి స్థలాన్ని వెంటనే గుర్తించాలని, అలాగే ప్రభుత్వ ఉద్యోగం కల్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలసిందిగా అధికారులకు సీఎం సూచించారు. కాగా, సీఎం రేవంత్ రెడ్డిని మహ్మద్ సిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. టీ-20 వరల్డ్ కప్‌ను గెలుచుకున్న అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న సిరాజ్ మంగళవారం జూబ్లీహిల్స్‌లోని రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లి.. సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రికెట్‌లో భారత దేశానికి, మన తెలంగాణ రాష్ట్రానికి గొప్ప పేరు, గౌరవాన్ని తెచ్చిన హైదరాబాదీ పేసర్ సిరాజ్‌ను రేవంత్ అభినందించారు. మహ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్‌లో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శిస్తున్నాడని కొనియాడారు. అందుకే ఈ రోజు అత్యున్నత స్థాయి క్రికెటర్లలో ఒకడుగా పేరు సంపాదించుకున్నారని ప్రశంసించారు. సిరాజ్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యోగం, ఇంటి స్థలం కేటాయించాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## 14 రకాల "పతంజలి" ఉత్పత్తుల అమ్మకాల రద్దు

**మొదటి పేజీ తరువాయి**

చేసిన విషయం తెలిసిందే. దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 5,606 ఫ్రాంచైజీ స్టోర్లకు 14 ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు పతంజలి మంగళవారం సుప్రీంకోర్టుకు అఫిడవిడ్ సమర్పించింది. ఈ ఉత్పత్తులను వెనక్కి పంపించాలని స్టోర్లకు సూచించినట్లు చెప్పింది. అదే విధంగా లైసెన్స్ రద్దు అయిన ఈ 14 ఉత్పత్తులకు సంబంధించి ప్రకటనలు సైతం నిలిపివేయాలని పలు మీడియా సంస్థలకు తెలిపామని పతంజలి అఫిడవిట్‌లో పేర్కొంది. ఇక తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద్ లిమిటెడ్ సంస్థ సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. పతంజలి నకిలీ ప్రకటనల కేసు విషయంలో బాబా రాందేవ్, బాలకృష్ణ చెప్పిన క్షమాపణలను సుప్రీం కోర్టు తిరస్కరించింది. తప్పుదోవ పట్టించేలా పతంజలి వాణిజ్య ప్రకటనలు ఇచ్చిందని నిర్ధరణ కావటంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఆ సంస్థపై చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ఈ సంస్థకు సంబంధించిన 14 రకాల ఉత్పత్తుల తయారీ లైసెన్సును ప్రభుత్వం రద్దు చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం లైసెన్స్ రద్దుచేసిన 14 రకాల తమ ఉత్పత్తుల అమ్మకాల నిలిపి వేసినట్లు పతంజలి సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది.

## ఆలయంలో తోపులాటపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

మంగళవారం జరిగిన తోపులాట ఘటనపై మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పోలీసులతో రివ్యూ నిర్వహించారు. ఈ ఘటన వెనక కుట్ర కోణం ఉందని అనుమానం వ్యక్తం చేసిన కొండా సురేఖ.. తోపులాట ఘటనపై దర్యాప్తు చేసి నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. కాగా, మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైన బల్కంపేట్ ఎల్లమ్మ కళ్యాణోత్సవ వేడుకలకు ప్రభుత్వం తరుపున మంత్రులు కొండా



సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. వీరితో పాటు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా ఉన్నారు. అయితే, ప్రభుత్వం తరుపున బల్కంపేట్ ఎల్లమ్మకు మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వెళ్తుండగా ఆలయంలో తోపులాట జరిగింది. ఈ ఘటనలో మేయర్ విజయలక్ష్మితో పాటు మరి కొందరు భక్తులకు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో భద్రతా కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మంత్రులు అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే పోలీసులతో రివ్యూ నిర్వహించి తోపులాట ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. తోపులాట వెనక కుట్ర కోణం ఉందని మంత్రి కొండా సురేఖ అనడం చర్చనీయాంశంగా మారింది.

## డీఎస్సీ పరీక్షల వాయిదాపై స్పష్టతనిచ్చిన ప్రభుత్వం

**మొదటి పేజీ తరువాయి**

విడుదలే చేసింది. డీఎస్సీ పరీక్షలను యథాతథంగా జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అభ్యర్థులు జులై 11న సాయంత్రం 5 గంటల నుంచి డీఎస్సీ హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. తెలంగాణలో 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న డీఎస్సీ పరీక్షల షెడ్యూలును విద్యాశాఖ జూన్ 28న ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిప్రకారం జులై 18 నుంచి ఆగస్టు 5 వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు. తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత విధానంలో రోజుకు రెండు షిఫ్టుల్లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు.

**టీఎస్ డీఎస్సీ 2024 పరీక్షల షెడ్యూలు ఇలా**

- జులై 18న మొదటి షిఫ్ట్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్, రెండో షిఫ్ట్‌లో ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తారు.
- జులై 19న సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష.
- జులై 20న ఎస్జీటీ, సెకండరీ గ్రేడ్ ఫిజికల్, స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షలు.
- జులై 22న స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ పరీక్ష.
- జులై 23న సెకండరీ గ్రేడ్ టీచర్స్ పరీక్ష.
- జులై 24న స్కూల్ అసిస్టెంట్ – బయలాజికల్ సైన్స్ పరీక్ష.
- జులై 25న స్కూల్ అసిస్టెంట్ తెలుగు, ఉర్దూ, మరాఠీ పరీక్షలు.
- జులై 26న తెలుగు భాషా పండిట్, సెకండరీ గ్రేడ్ టీచర్ పరీక్ష.
- జులై 30న స్కూల్ అసిస్టెంట్ సోషల్ స్టడీస్ పరీక్ష.
- ఆగస్టు 5 వరకు మిగతా పరీక్షలను నిర్వహించనున్నారు.

## అంగన్వాడీల్లో నాణ్యత లేని గుడ్ల పంపిణీపై సీతక్క సీరియస్

**మొదటి పేజీ తరువాయి**

అధికారులను నివేధిక కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు నాసిరకం గుడ్లు సరఫరా అవుతున్నాయన్న వార్తలపై సీతక్క సీరియస్ అయ్యారు. నాణ్యత లేని గుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్వాడీ కేంద్రాలకు మంచి గుడ్లు సప్లై అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గుడ్లు నాణ్యమైనవిగా కనిపించకుంటే వాటిని తిరస్కరించాలని అంగన్వాడీలకు సూచించారు. అలా చేయకుంటే అంగన్వాడీ టీచర్లు, స్థానిక అధికారులను బాధ్యులను చేయాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తువుల సరఫరా చేసే కాంట్రాక్టర్ల గడువును గత ప్రభుత్వం మరో రేండేళ్లకు పొడిగించడం వల్ల కాంట్రాక్టర్లు అవకతవకలకు పాల్పడుతున్నారని, ప్రభుత్వం కాంట్రాక్టర్ల గడువును తగ్గించే యోచనలో ఉందని తెలిపారు. ఇకనుంచి క్వాలిటీ చెకింగ్ కోసం జిల్లాలకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ వస్తారని, వారు నిరంతరం తనిఖీలు చేస్తారని మంత్రి అన్నారు. నాణ్యత లేని ఆహార సరఫరా వల్ల చిన్నపిల్లలు, బాలింతలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, నాణ్యమైన గుడ్లు, నాణ్యమైన భోజనం అందించేలా చూడాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు.

## 2 రోజుల్లో విడుదలకానున్న రుణ మాఫీ విధివిధానాలు

శ్రీనివాసులరెడ్డి ప్రకటన చేశారు. రుణ మాఫీకి సంబంధించిన విధివిధానాలను 2 రోజుల్లో విడుదల చేస్తున్నామని వెల్లడించారాయన. మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మంగళవారం ఈ విషయాన్ని స్పష్టం చేశారాయన. రెండు రోజుల్లో రుణమాఫీ గైడ్లైన్స్ విడుదల చేస్తామన్నారు.%అ%ఆగస్టు 15 లోగా పూర్తి చేస్తము. నిధుల సమీకరణ స్టార్ట్ అయింది. నేడు రైతు భరోసా పై ఖమ్మం లో అభిప్రాయం సేకరణ స్టార్ట్ చేస్తున్నాము. రైతులు, ఉద్యోగులు, మేధావులు, రైతు సంఘాల నేతలు అభిప్రాయంలు తీసుకుంటున్నాము. నేను ఇంత వరకు రైతు బంధు తీసుకోలేదు చెక్ లు ఇచ్చిన తిరిగి ఇచ్చానని చెప్పారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# హిందూ దేవుళ్లపై వ్యాఖ్యలు సెక్యులరిజమా.,.

హిందూ సాంస్కృతిక విలువలపై, హిందువుల ఆచార సాంప్రదాయాలపై, హిందూ దేవుళ్లు, దేవతలపై పనిగట్టుకుని, అవాకులు చవాకులు పేలడం దేశంలో ఇటీవల కాలంలో ఎక్కువైంది. తాజాగా కాంగ్రెస్ రాకుమారుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంయమనం కోల్పోయి, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం సందర్భంగా హిందూ దేవుళ్ల ప్రస్తావన చర్చకు తీసుకొచ్చి దేశ ప్రజలను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు..స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్రం తర్వాత కాంగ్రెసులోని చాలామంది నాయకులకు హిందువుల ఆచారాలు, సంప్రదాయాల పట్ల, హిందువుల ఆధ్యాత్మికత పట్ల నిర్లక్ష్య భావన ఉంది. దేశంలోని ప్రతి సమస్యకు హిందువుల ఆచార సంప్రదాయాలను కారణంగా చూపడం పరిపాటి అయిపోయింది. అందుకు కారణం లేకపోలేదు.ఈ దేశంలో మెజార్టీ ప్రజలైన హిందువుల ఆచార సంప్రదాయాలు ప్రధాన మైనారిటీ మతాలైన ఇస్లాం, క్రైస్తవ భావజాలానికి భిన్నంగా ఉంటాయి. అందుకే ముస్లింలను, క్రైస్తవులను వెనుకేసుకొచ్చి హిందువుల ఆచారాలను దూషించడం కానీ, ద్వేషించడం కానీ చేస్తే ముస్లింల, క్రైస్తవుల ఓట్లు గుండుగుత్తగా తమ పార్టీకి పడతాయని బీజేపీయేతర అన్ని పార్టీల నాయకులు తలపోయడం అలవాటుగా మారిందనేది అక్షర సత్యం.ఇండియా కూటమిలో భాగస్వామ్య పార్టీ అయిన డీఎంకే నాయకుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మాన్ని అనుసరించే హిందువులను నీచ నికృష్టంగా తిట్టిపోశారు. ఆయన తాత కరుణానిధి ఏకంగా మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడ్ని నోటికొచ్చినట్లు మాట్లాడి, హిందువులపై తనకు ఉండే ద్వేషాన్ని వెళ్లగక్కారు. ఇక కాంగ్రెస్ పార్టీ చరిత్ర తిరగేస్తే రామాయణం ఒక కట్టు కథని, సుప్రీంకోర్టుకే అఫిడవిట్ దాఖలు చేసి, తన హిందూ వ్యతిరేక పైత్యాన్ని బయట పెట్టుకున్నది. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇందుకు భిన్నంగా ఉంటారని ఎందుకు అనుకోవాలి?బీజేపీ , ఆర్ఎస్ఎస్ వాళ్లకు హిందూ సంస్కృతికి సంబంధించిన విషయాలు తెలియవని, వారు నిజమైన హిందువులు కాదని రాహుల్ గాంధీ తరచుగా మాట్లాడుతుంటారు. ఈ దేశాన్ని వ్యతిరేకించే వారి దృష్టిలో ఆర్ఎస్ఎస్, బీజేపీ వాళ్లు మంచివాళ్లు కాదేమో! ఎందుకంటే దేశ భద్రతకు, సమగ్రతకు ప్రమాదం వచ్చినప్పుడు గట్టిగా నిలబడేది వాళ్లే. కశ్మీర్ విలీనీకరణకు కశ్మీర్ రాజు హరి సింగ్‌ను ఒప్పించడం, శ్రీనగర్లో మన యుద్ధ విమానాలు దిగడానికి మంచు గడ్డలు తొలగించడం, శ్రీనగర్ లాల్ చౌక్‌లో పాకిస్తాన్ జెండాను తొలగించి, జాతీయ జెండాను ఎగరవేయడం , పోర్చుగీసు చెర నుండి గోవాను విముక్తి చేయించడంలో సైన్యానికి సహకరించడం, యుద్ధ సమయాల్లో సైన్యానికి ఫోర్టర్లుగా పనిచేయడం వంటి పనులు చేసే వాళ్లు నిజమైన హిందువులు ఎలా అవుతారు? పైగా కాశ్మీర్ లోయలో హిందువుల నరమేధాన్ని లౌకికవాద ముసుగు వేసుకున్న ఏ హిందూ రాజకీయ నాయకుడు ప్రశ్నించకున్నా బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లు నిలదీశారు కదా! 500 సంవత్సరాలుగా రావణకాష్టంగా మండిన అయోధ్య సమస్యను సులభంగా పరిష్కరించారు కదా! ఇలాంటి పనులు చేసిన వారు నిజమైన హిందువులు అవుతారా? ఈ విషయం భవిష్యత్తు చరిత్ర నిర్ణయించాలి.లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా తొలిసారి ప్రసంగించారు రాహుల్ గాంధీ. ఈ క్రమంలోనే శివుడి ఫొటోని చూపించారు. దీనిపై స్పీకర్ ఓం బిర్లా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సభలో ప్లకార్డులు, ఫొటోలు ప్రదర్శించడం నిషేధం అని తేల్చి చెప్పారు. ఇదే సమయంలో రాహుల్ గాంధీ రాజ్యాంగం గురించీ ప్రస్తావించారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తోందని మండి పడ్డారు. ఇది జరగకుండా తాము అండగా నిలబడతామని తేల్చి చెప్పారు. ఈ సమయంలోనే హిందూమతం గురించి మాట్లాడారు రాహుల్. బీజేపీ ఈ మతం పేరు చెప్పి అందరినీ భయపెడుతోందని మండిపడ్డారు. ఏ మతమైనా మనుషులకు ధైర్యం ఇస్తుందని వెల్లడించారు. ఇస్లాం, సిక్కు మతాల గురించి కూడా ప్రస్తావించారు. కొంత మంది తమను తాము హిందువులుగా ప్రచారం చేసుకుంటూ విద్వేషాలను రెచ్చగొడుతున్నారని, అలాంటి వాళ్లు అసలు హిందువులే కాదని తీవ్ర విమర్శలు చేశారు. హింసను ప్రేరేపించే వాళ్లను హిందువులు అని ఎలా అనగలమని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ స్పీచ్‌ని అడ్డుకున్నారు. హిందువులంతా హింసావాదులే అన్నట్టుగా మాట్లాడడం చాలా తీవ్రంగా పరిగణించాల్సిన విషయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ హిందూ దేవుళ్లపైన చేసిన ప్రస్తావనను క్షుణ్ణంగా పరిశీలిస్తే దేశంలోని హిందువులు హింసావాదులనీ, విద్వేష కారకులనే అర్థం స్ఫురించక మానదు. ఈ విషయంలో ఆయన మాట మార్చి, బీజేపీ, ఆర్ఎస్ఎస్ వాళ్లను ఉద్దేశించి, ఈ మాటలు అన్నానని ఎంత బుకాయించినా – హిందూ సమాజానికి ఆ మాటల అర్థం చేరిపోయింది. ఇక చివరగా హిందువులను మతపరంగా సంఘటితం చేసే పనిని ఎవరు చేసినా వారికి ఈ దేశంలో దూషణలు తప్పవు. ఈ పరిస్థితి భవిష్యత్తులో తీవ్రంగా ఉంటుంది.

# విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకోవాలి

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క) టాపర్లుగా నిలిచిన విద్యార్థినిలకు సైకిల్ లను పంపిణీ చేసిన మంత్రి**





ములుగు, జూలై 09 (తీన్మార్ న్యూస్): విద్యార్థిని, విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మంగళవారం ఇంచర్లలోని ఎంఆర్ ఫ%శీ%క్షన్ హాల్ లో 2023–24 విద్యా సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్ లో టాపర్లుగా నిలిచిన 27 మంది పదవ తరగతి 16 మంది ఇంటర్మీడియట్ విద్యార్థినిలకు మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలసి రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై మక్కువ పెంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి కృషి చేయాలని అన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలు విద్యార్థులు మరింత ఉత్సాహంగా చదువులో రాణించుటకు ఉపయోగపడతాయని మంత్రి అన్నారు. ఇదే విధంగా భవిష్యత్తులో సైతం క్రమశిక్షణతో వ్యవహరించి మంచి ఫలితాలు సాధించాలని మంత్రి విద్యార్థులకు సూచించారు. రాబోయే సంవత్సరంలో సైతం 10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులపై ముందు నుంచి ప్రత్యేక శ్రద్ధ వహించి మరింత మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ సభ్యులు పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఒక అమ్మాయిని గొప్ప చదువులు చదివించడం వల్ల ఆ కుటుంబం మొత్తం బాగుపడుతుందని తెలిపారు. ఇంటిలో మనం అన్ని అంశాలలో అబ్బాయిలను, అమ్మాయిలను ఒకే రీతిలో చూడటం ప్రారంభించాలని, బాలికలను కొన్ని రంగాలకు మాత్రమే పరిమితం చేయవద్దని, మగవారితో సమానంగా వారికి క్రీడలు మొదలగు రంగాలలో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వారి అభిరుచుల ప్రకారం ఆశయాలను నిర్దేశించుకోవాలని, వాటి సాధన కోసం నిర్విరామంగా, క్రమశిక్షణతో కృషి చేయాలని అన్నారు. మనకు నైపుణ్యం ఎంత ఉన్నప్పటికీ క్రమశిక్షణ, పట్టుదల లేకపోతే గొప్ప స్థాయికి చేరుకోలేమని, క్రమశిక్షణ పట్టుదల ఉంటే నైపుణ్యం తక్కువ ఉన్న వివిధ అంశాలను నేర్చుకొని గొప్ప స్థాయికి చేరుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, సంబంధిత అధికారులు, విద్యార్థినిలు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి

**– సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
**– జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు**
**– ఆదేశాలు జారీ చేసిన సీఎస్ శాంతి కూమారి**






భువనగిరి జిల్లా ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. మంగళవారం నాడు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వన మహోత్సవం, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, ఉద్యోగుల బదిలీలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత జూన్ మాసంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వరంగల్ జిల్లాలో మహోత్సవం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారని, రాష్ట్రవ్యాప్తంగా 20 కోట్లకు పైగా మొక్కలు నాటే లక్ష్యంగా పెట్టుకోవడం జరిగిందని, జిల్లాల వారీగా కేటాయించిన లక్ష్యాలను సాధించాలని, గ్రామాలకు అవసరమైన మొక్కలను, అందులో పెద్ద మొక్కలను నాటాలని, ప్రతి మొక్కను జియో టాగ్ చేయాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా శక్తిమంతులను చేసి వారిని కోటీశ్వరులను చేయడమే మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలలో దిగ్విజయంగా నెరవేర్చాలని సూచించారు.



స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడం మహిళా శక్తి పథకం ప్రధాన ఉద్దేశాలని, సూక్ష్మ తరహా పరిశ్రమలను గుర్తించి సంఘాలను ప్రోత్సహించడం, మహిళలు తమ నైపుణ్యాలకు తగ్గ ఉత్పత్తులను ఎంచుకుని, ఆ ఉత్పత్తులకు అవసరమైన నైపుణ్యాన్ని అందించడం, ఉత్పత్తికి అవసరమైన ఆర్థిక సహకారం కోసం బ్యాంక్ లింకేజీల సదుపాయం కల్పించడం, ఉత్పత్తి అయిన సరుకులు మార్కెటింగ్ కు అవసరమైన ప్రణాళికలు, సహకారం అందివ్వడం మహిళాశక్తి పథకంలో భాగమని, 16 రకాల జీవనోపాదులు ఇందులో భాగమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేసి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని, జిల్లా, మండల మహిళా సమాఖ్యలతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని యాక్షన్ ప్లాన్ తో వర్క్ షాప్ లు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యం ముఖ్యమని, కిచెన్, టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డెంగీ, మలేరియా, అతిసారా వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆశా, ఎ.ఎన్. ఎం.సిబ్బంది క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలని, ఆరోగ్య కేంద్రాలలో మందులు అందుబాటులో ఉండాలని సూచించారు. వ్యవసాయ రంగం సంబంధించి ఎరువులకు ఎలాంటి కృత్రిమ కొరత లేకుండా చూడాలని, రైతు భరోసా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు నేస్తం ప్రోగ్రాముల ద్వారా రైతులకు కావలసిన సలహాలు, నూతన సాగు విధానాలపై ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులలో పూర్తి కాని పనులను వెంటనే చేయాలని తెలిపారు. టీచర్ల బదిలీలు విజయవంతంగా జరిపిన విధంగానే ఉద్యోగుల బదిలీలు నిబంధనలను పాటిస్తూ ఈనెల 20 లోగా ముగించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంత్ కే. జండగే, అదనపు కలెక్టర్లు పి.బెన్ షాలోమ్, కే. గంగాధర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజా రాణి, జిల్లా పరిషత్ సిఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి ఎం.ఏ. కృష్ణన్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పంచాయత్ అధికారి సునంద, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ఎక్సైజ్ అధికారి సైదులు, పంచాయత్ రాజ్ ఇ.ఇ. వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెట్టింగ్ అధికారి సబిత, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా శక్తికి పెద్దపీట

**– వచ్చే ఏడాది కల్లా కల్వకుర్తి పూర్తి**
**– కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కీలక ఆదేశాలు**
**– మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన సీఎం**
**– వన మహోత్సవంలో మొక్కలు నాటిన సీఎం**
**– మహిళా సంఘాలకు 334 కోట్ల రెండు లక్షల చెక్కు పంపిణీ**
**– 396.06 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన**
**– రూ.6.10కోట్లతో దేవరకద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాల శంకుస్థాపన**
**– పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవం**
**– రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా శక్తికి పెద్దపీట కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వచ్చే ఏడాది డిసెంబర్ కల్లా పూర్తి చేసి నిరందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి,ముఖ్యమంత్రి తో పాటు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, రాష్ట్ర సాగు నీటి, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లకు మంగళవారం కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నా రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి డి.జానకి, స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కుచుకుళ్ళ రాజేష్, అచ్చంపేట వంశి కృష్ణ, కల్వకుర్తి శాసన సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, షాదనగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, నారాయణ్ పేట పర్ణిక రెడ్డి, గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ శాసన సభ్యులు విజేయుడు లు సీఎం కు ఘన స్వాగతం పలికారు. కలెక్టరేట్ (ఐ.డి.ఒ.సి) ప్రాంగణంలో జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర అబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి మొక్కను నాటారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా మహాగని మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించిన ముఖ్యమంత్రి కలెక్టరేట్ లో పార్టీ నాయకులతో ముఖాముఖి నిర్వహించారు. మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 15 లక్షల వ్యయంతో ఐ.డి. ఒ.సి లో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభోత్సవం చేశారు. హన్వాడ మండలం విజయలక్ష్మి మహిళా సంఘం ద్వారా ఈ క్యాంటీన్ ను ఏర్పాటు చేయగా ముఖ్యమంత్రి అక్కడే భోజనం చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని 3680 మహిళా సంఘాల గ్రూపులకు రూ. 334.02 కోట్ల చెక్కును మహిళా సంఘాల సభ్యులకు అందజేసారు.



**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవం**

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో దాదాపు 396.06 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.42.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు.13 కోట్ల 44 లక్షల రూపాయల పనులు శంఖుస్థాపన చేశారు.ఎంవీఎస్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.10కోట్లతో బాలికల హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దేవరకద్ర రూ.6.10కోట్లతో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ రూరల్ లో రూ.3.25 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గండీడ్ రూ.6.20 కోట్లతో కేజీవీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాలమూరు యూనివర్సిటీలో రూ.13.44 కోట్లతో ఎస్టీపీ, అకాడామిక్ బ్లాక్, గ్యాలరీ పనులకు శంకుస్థాపన చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.37.87 కోట్లతో సీసీ రోడ్లు, స్టోరేజ్ ట్యాంక్ పనులకు శంకుస్థాప చేశారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో రూ.276.80 కోట్లతో ఎస్టీపీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టరేట్ లో ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ లు,అధికారులతో సాగు నీటి ప్రాజెక్టులు, వైద్య,ఆరోగ్యం, విద్యా రంగం పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధులకు మాజీ ఎమ్మెల్యే సన్మానం






**ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న చల్లా ధర్మారెడ్డి**

హనుమకొండ, జూలై 09 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఏ.ఎన్.ఆర్.గార్డెన్స్ లో ఏర్పాటుచేసిన 2019 – 2024 దామెర మండలం ఎంపిపి, జెడ్పీటీసీ,ఎంపీటీసీలు, సర్పంచులు మరియు అధికారుల ఆత్మీయ సమ్మేళనంలో పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తయిన ప్రజాప్రతినిధులను మాజీ ఎమ్మెల్యే మంగళ వారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ అధికారులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను అన్యాయానికి గురి చేస్తే తగిన గుణపాఠం చెప్తాం

**– బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ సాగర్**

మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి, జులై 09(తీన్మార్ న్యూస్): బీసీలను అవసరం వరకు వాడుకొని, అణగదొక్కాలని చూస్తే తగిన గుణపాఠం చెప్పేందుకు బీసీ సమాజం సిద్ధంగా ఉందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్ సాగర్ హెచ్చరించారు. బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలను ప్రతి విషయంలో విస్మరించి కార్పొరేషన్ పదవుల్లో, మంత్రి మండలిలో, నామినేటెడ్ పదవుల్లో, పదోన్నతుల విషయంలో తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారని ఇలాగే భవిష్యత్తులో పునరావృతమైతే బీసీల నుంచి వ్యతిరేకతను మూటకట్టుకోవాల్సి వస్తుందన్నారు. గద్వాలలో ఎంఎల్ఏ కృష్ణమోహన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొని అక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచి గెలుపు దిశగా అడుగులు వేసిన బిసి బిడ్డ సరిత తిరుపతయ్యను నేడు అన్యాయానికి గురిచేశారన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని బరిలో నిలిచి నడిగడ్డలో కాంగ్రెస్ జెండాను ఎగురవేసి బంగ్లా రాజకీయాలను నడిపిస్తున్న అత్త అల్లుడిని ఇంటికి పంపేందుకు కృషి చేసిన సరిత తిరుపతయ్యను నేడు అగ్రవర్ణ నాయకులు ఏకమై రాజకీయంగా ఎదగనీయకుండా కుట్రలు పన్నుతున్నారని శ్రీనివాస్ సాగర్ అన్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పై గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఎంఎల్ఏ పేరు మీద పోస్ట్ లను సృష్టించి మంత్రి పదవి రేసులో ఉన్న అతనికి ఇబ్బందులు కల్పించే విధంగా అగ్రవర్ణ నాయకు లు తెర వెనుక కుట్రలు పన్నుతున్నారని శ్రీనివాస్ సాగర్ అన్నారు. అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గం చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రదీప్ కుమార్ గౌడ్, అసెంబ్లీ ఎన్నికలకు ముందు




కాంగ్రెస్ పార్టీని వీడి టిఆర్ఎస్ పార్టీలో చేయడం జరిగిందని, పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకుని జాయిన్ అయినా ఈరోజు వరకు సముచిత స్థానం కల్పించకపోవడం వెనుక ఉన్న అగ్రవర్ణ కుట్రలను శ్రీనివాస్ సాగర్ ఖండించారు. అదే ఒక రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే అర్ధరాత్రి పార్టీలోకి తీసుకొని కండువాలు కప్పి, అప్పటికప్పుడే పదవులు కట్టబెట్టడం చూస్తున్నామన్నారు. జడ్చర్ల నియోజకవర్గం లో గత 40 సంవత్సరాలుగా వివిధ రాజకీయ పదవుల్లో ఉన్న పిఏసిఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్ ను రాజకీయంగా ఇబ్బందులు పెడుతూ, చేస్తున్న పనుల్లో అడ్డంకులు సృష్టిస్తూ భవిష్యత్తులో రాజకీయంగా తమకు పోటీ అవుతాడు అనే ఉద్దేశంతో అగ్రవర్ణ నాయకులు కుట్రలు పని ఇబ్బందులు పెట్టడాన్ని బీసీ సమాజ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇటువంటి సంఘటనలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో బీసీలందరూ కలిసికట్టుగా ఉంటూ భవిష్యత్తులో రెడ్డిల ఉనికిని ఈ జిల్లాలో ప్రశ్నార్థకంగా మార్చేందుకు అందరం శాయశక్తుల పని చేయాలని శ్రీనివాస్ సాగర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మీకాంత్, బీసీ సమాజ్ కో సవారి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కృషి,పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు

**– యాచారం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ**

**– తన సొంత నిధులతో విద్యార్థులకి వాలీబాల్ కిట్లు అందజేత**



యాచారం, జూలై 09(తీన్మార్ న్యూస్): విద్యార్థులు కృషి,పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు అని యాచారం సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ అన్నారు. మంగళవారం రోజు యాచారం మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తన సొంత నిధులతో వాలీబాల్ కిట్టును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వెంకటనారాయణ మాట్లాడుతూ యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు వ్యక్తుల మధ్య పోటీతత్వం పెంచుతాయని అన్నారు. విద్యార్థులు అందరూ ఏకాగ్రతతో పట్టుదలతో శ్రద్ధగా ఇష్టంతో కష్టపడి చదువుకొని ఉత్తమ లక్ష్యాన్ని ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. క్రీడలు కబడ్డీ, క్రికెట్ తదితర ఆటలు



మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని, దేహదారుఢ్యాని, శారీరక పరిపక్వతను, పెంపొందిస్తాయని అన్నారు. భవిష్యత్తులో మంచి చదువులు చదువుకొని మంచి ఉద్యోగాల్లో ఐఏఎస్, ఐపీఎస్, కావాలంటే పట్టుదల కసి ఉంటేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని ఉన్నారు. ఆటలు ఆడేవారు రాణించాలంటే పట్టుదల, కసి, పోటీ తత్వం ఉంటేనే ఆటలలో రాణిస్తారని, సాధిస్తారని ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు, గ్రామానికి, మండలానికి, దేశానికి మంచి పేరు తేవాలని కోరారు. ఆటలలో నేషనల్ స్థాయికి వెళ్తే 5 వేల రూపాయలు బహుమతిగా ఇస్తానని, ఇంటర్నేషనల్ స్థాయికి వెళితే 10 వేల రూపాయలు బహుమతిగా ఇస్తానని హామీ ఇచ్చారు. తన సొంత నిధులతో వాలీబాల్ కోర్టు కి కావలసిన రెండు పోల్స్ ను వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయులు ఎస్ఐ వెంకటనారాయణ నీ ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జి హెచ్ఎం కే నరసింహ, ఉపాధ్యాయులు ఆనంద్ జోసెఫ్, గోవర్ధన్ చారి, వెంకట్ రెడ్డి, గోపాల్, జగదీష్, లక్ష్మణ్, భోజయ్య, శ్రీదేవి, నీరజ, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చిరుత పులి గాలింపు పై చర్యలు చేపట్టిన పెద్దమందడి ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరేష్

**– చిరుత పులి కాదు కుక్కల దాడిలోనే అని నిర్ధారణ**





వనపర్తి ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): పెద్దమండి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ శివారులోని పెద్దగుట్టు పడాలగట్టు సమీపంలో చిరుతపులి సంచరిస్తున్నట్లు గొర్రెలకాపరులు తెలిపారు. సోమవారం పామిరెడ్డిపల్లికి చెందిన పాలెం శ్రీశైలం, మల్లయ్య, యాదయ్య, శివయ్యలు తమ గొర్రెలమందను మేతకు తీసుకెళ్తున్న సమయంలో ఆకస్మాత్తుగా చిరుతపులి దాడి చేసి గొర్రెపిల్లను ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. చిరుత సంచారంపై అటవీశాఖ దృష్టి పెట్టి బందించాలని గ్రామ ప్రజలు కోరగా మంగళవారం పెద్దమందడి మండలం ఫారెస్ట్ సెక్షన్ అధికారి నరేష్ గాలింపు చర్యలు చేపట్టి చిరుత పులి కాదని నిర్ధారించి గొర్రె పిల్లలని కుక్కలు దాడి చేసినట్టు వివరించారు. రైతులు మరియు గొర్రెల కాపరులు ఎటువంటి భయాందోళనకు గురికకూడదని దైర్యం ఇచ్చారు.

# జవహర్ నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లిన జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూ

**– ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కలిగించాలి**

**– జవహర్ నగర్లో పర్యటించిన కలెక్టర్ గౌతమ్ పోట్రు**

**– సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి**

**– దీర్ఘకాలిక రోగులకు మందులు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు**

**– ప్రభుత్వ పాఠశాలలో ఆహ్లాకరమైన వాతావరణంలో విద్యానందించాలి**

**– మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్ పోట్రు**

జవహర్ నగర్, జులై 09(తీన్మార్ న్యూస్): ప్రజలకు మెరుగైన వైద్యం అందించి మన్ననలు పొందాలని, ప్రభుత్వ దవాఖానాలకు వచ్చే రోగులకు వైద్యంపై నమ్మకం కలిగించాలని, దీర్ఘకాలిక రోగులకు సేవలు ఎలా అందిస్తున్నారని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. మంగళవారం జవహర్ నగర్



కార్పొరేషన్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ దవాఖానాను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, సహజసిద్ధమైన డెలివరిలకు అవకాశం కల్పించాలని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పెంచాలని అన్నారు. మలేరియా, డెంగ్యూ విజృంభించే అవకాశం ఉందని, బీపీ, షుగర్ మందులు నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ఆనంతరం హాస్పిటల్ రోగులతో మాట్లాడుతూ సేవలు ఎలా అందుతున్నాయని వైద్య సిబ్బంది ఎలా పనిచేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.

# జర్నలిస్టు వృత్తి పవిత్రమైనది

**– జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలి**

**– జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరు**

**– టియుడబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్**




వనపర్తి ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): జర్నలిస్టు వృత్తి పవిత్రమైనదనీ నిబద్ధతతో పనిచేసి జర్నలిస్టులు మానవతా విలువలు పెంపొందించుకోవాలనీ తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు యూనియన్(టీయూడబ్ల్యూజె) రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ అన్నారు. టీయూడబ్ల్యూజె(ఐజెయూ) వనపర్తి జిల్లా, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరావు అధ్యక్షతన వనపర్తి పట్టణంలోని తరుని ఫంక్షన్ హాల్ లో నూతనంగా రాష్ట్ర కార్యదర్శి గా ఎన్నికైన మధు గౌడ్ కు అభినందన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహిత మధు గౌడ్ మాట్లాడుతూ జర్నలిస్టులు మానవీయ కోణంలో వార్తలు రాస్తే తగిన గుర్తింపు వస్తుందన్నారు. తొలిసారిగా వనపర్తి జిల్లాకు రాష్ట్ర పదవి దక్కిందని ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా జర్నలిస్టులకు సేవలందిస్తూనే ఉంటానని అన్నారు. తాను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక అయ్యేందుకు సహకరించిన యూనియన్ రాష్ట్ర, అధ్యక్ష కార్యదర్శులు విరహత్ అలీ, రామ్ నారాయణ లకు కృతజ్ఞతలు తెలిపారు. తాను ఉమ్మడి జిల్లా బాధ్యులుగా ఉన్నప్పటికీ మొదటి ప్రాధాన్యత వనపర్తి జిల్లాకు ఉంటుందని అన్నారు. జర్నలిస్టుల సమస్యలతో పాటు వారికి ఏ విధమైన సమస్య ఉన్న సంఘం పరంగా పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. జిల్లాలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సహకారంతో తాను ఈ స్థాయికి ఎదిగానని ఎంత ఎదిగిన జర్నలిస్టుల సమస్యల విషయంలో రాజీ లేని పోరాటం చేస్తూనే ఉంటానని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల మౌలిక సదుపాయాల కల్పన కోసం తన వంతు పాత్ర పోషిస్తానని అన్నారు.వనపర్తి జర్నలిస్టుల సంఘటిత శక్తి తన పదవి అని, జర్నలిస్టులు సంకిచిత భావాన్ని వీడి పని చేయాలని అన్నారు. పొగడ్తలు విమర్శలు రెండును స్వీకరించే తత్వం తనదని ఎదుటి వ్యక్తి ఎంత విమర్శించిన నవ్వుతూ స్వీకరించి విమర్శలను మర్చిపోతూ వారితో సఖ్యత ఉండడమే తన బలమని చెప్పారు. త్వరలో ప్రెస్ అకాడమీ నుంచి జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య అందించే జీవో రాబోతుందని ఆ పనులు వేగవంతం అవుతున్నాయనీ అన్నారు. జర్నలిస్టుల వైద్య సదుపాయం ఇళ్ల స్థలాలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను శాలువా పూలమాలలతో ఘనంగా సత్కారం చేశారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నికైన రమేష్ ను సన్మానించారు. సభ ప్రారంభానికి ముందు ఈనాడు, ఈటీవీ వ్యవస్థాపకులు స్వర్గీయ రామోజీరావుకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాగర్ కర్నూల్ జిల్లా ఇన్చార్జి శ్యామ్, వనపర్తి జిల్లా కార్యదర్శి మాధవ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడుప్రశాంత్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రమేష్, సీనియర్ పాత్రికేయులు ఉషన్న, పౌర్ణరెడ్డి, బి.రాజు, ఖలీల్ ఎల్ల గౌడ్, సాహితీ కళావేదిక కన్వీనర్ పలుస శంకర్ గౌడ్, గంధం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మహిళా కన్వీనర్ ధనలక్ష్మి వాల్మీకి సంఘం నాయకులు రాములు, పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, ధ్యారపోగు మన్యం, జర్నలిస్ట్ నాయకులు భాస్కర్, దినేష్, కుమార్, విజయ్ నాకొండ, జిల్లా ఉర్దూ పత్రికలు, మహ్మద్ కమల్, ఎండి షఫీ, ఎండి షీరాజ్, నశిరోద్దీన్, ఎం ఏ సలాం, అబ్దుల్ వహిద్, గోపాల్ జిల్లా ఫోటో జర్నలిస్టులు ఎస్.వి రమేష్, రాము, యాదిరెడ్డి, శ్రీకాంత్ వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు

ఆత్మకూరు, జులై 09(తీన్మార్ న్యూస్): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆత్మకూర్ శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవ మరియు జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం లో ర్యాలీతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన శ్రీ శ్రీధర్ గౌడ్,యాంకి లింగన్న రిటైర్డ్ టీచర్, వెంకటేష్ మాట్లాడుతూ" కేవలం 4 మందితో మొదలై జాతీయవాద భావాలతో విద్యార్థుల సమస్యలపైన నిరంతరం పోరాటం చేస్తూ ఈ రోజు ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంస్థగా ఆవిర్భవించిన "అఖిల భారతీయ విద్యార్థి పరిషత్" 76వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

**జ్ఞానం!శీలం!!ఏకత!!!...పరిషత్ ప్రత్యేక..అంటూ క్షణం క్షణం మా కణం కణం... భారతమాతకే**

అంటూ దేశంలో విద్యార్థి సమస్యలే కాకుండా, విపత్తులు





సంబవించినప్పుడు కూడా ముందుంటూ దేశ పునరనిర్మాణంలో భాగస్వామ్యం అవుతున్న ఏకైక విద్యార్థి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్.అలాగే విద్యార్థి పరిషత్ ఆవిర్భావం రోజునే జాతీయ విద్యార్థి దినోత్సవం గా జరుపుకుంటాం.పూర్వ, ప్రస్తుత విద్యార్థి పరిషత్ సభ్యులకు జాతీయవాద విద్యార్థి కుటుంబసభ్యులకు 76వ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం మరియు జాతీయ విద్యార్థి దినోత్సవ శుభాకాంక్షలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయికుమార్, ఎస్ ఎఫ్ డీ జిల్లా కన్వీనర్ అఖిల్, అనిల్, మనీ, నవీన్, స్వామి, వివేకానంద సేవ సమితి అధ్యక్షులు బాలు, పూర్వ కార్యకర్తలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పెయింటింగ్ అసోసియేషన్ మండల అధ్యక్షులు మృతి

**– నివాళులు అర్పించిన ఎమ్మెల్యే వేముల వీరేశం**

రామన్నపేట, జూలై 09(తీన్మార్ న్యూస్): పట్టణనికి చెందిన పెయింటర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఎండి ఇలియాస్ ఖాన్ అనారోగ్యం తో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వారి స్వగృహానికి వెళ్లి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గంగుల వెంకట రాజిరెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, మాజీ ఎంపీటీసీ ఎండీ రేహాన్, గుత్త నర్సిరెడ్డి, ఎండి అక్రమ్, కాంగ్రెస్



పార్టీ టౌన్ అధ్యక్షుడు జమీరుద్దీన్, సాల్వేరు లింగం, ఎండి.నాసర్, ఎండి.జానీ, ఎస్కే.షబ్బీర్, ఎండీ.రిజ్వాన్, ఎస్కే.ఆరిఫ్, మీర్జా ఇనాయత్ బేగ్, అస్లాం భేగ్, ఎండీ.బాసిత్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ లు రద్దు చేయాలి

**– మా కాలనీ భూమి మాకు ఇవ్వాలి అని తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టిన బాధితులు**

**– వినతిపత్రం అందజేత**



రాజాపేట, జూలై 09(తీన్మార్ న్యూస్): మండలంలోని బేగంపేట గ్రామంలో బీసీ కాలనీవాసులు నీలా ఆంజనేయులు, నీల ఉప్పలయ్య, రాగుల బిక్షపతి, గుర్రం కర్ణాకర్ లు బేగంపేట గ్రామంలో 1992 వ సంవత్సరంలో సర్వే నెంబర్ 168 లో 50 ప్లాట్లకు ఇచ్చారు. అందులో 30 ప్లాట్స్ ఇండ్లు నిర్మించిగా మిగిలిన స్థలం కాలనీ ఆధ్వర్యంలో ఉందని తెలిపారు. ఈ కాళీ స్థలాన్ని బేగంపేట గ్రామానికి చెందిన జెల్ల శ్రీను మరియు ఓరుగంటి కిష్టయ్యలు అక్రమంగా కొంత పట్టాగా మార్చి పట్టా పాస్ బుక్ లు వచ్చాయాని కాలనీ ఆధ్వర్యంలో వున్నా భూమి ని కబ్జా చేస్తున్నారు అని సోమవారం రాజాపేట తహసిల్దార్ కార్యాలయం ముందు బాధితులు, కాలనీవాసులు ధర్నా చేపట్టి తహసిల్దారు కు వినతి పత్రం అందజేశారు. పాత పట్టేదార్ తో కలిసి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి భూమి తొలగించి హౌస్ సైట్స్ గా మార్చి మా కాలనీ భూమి మాకు వచ్చేలా చేయాలని కోరారు. అట్టి భూమి లో గవర్నమెంట్ కి సంబంధించిన భవనాలు కానీ ఇతర సంబంధించిన పనులకు వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితులకు మద్దతుగా మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ది ప్రజా పాలన కాదు రాక్షస పాలన

**– మాజీ డిసిసిబి గొంగిడి మహేందర్ రెడ్డి**



రాజాపేట, జూలై 09(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కేంద్రంలో ఏర్పాటు సోమవారం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశానికి మాజీ డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందడి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీది ప్రజా పాలన కాదని రాక్షస పాలనని కక్షపూరితంగా వ్యవహరిస్తుందని, బిఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ప్రజా ఉద్యమాలతో ఎదుర్కొంటామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో రైతుబంధు, ఏకకాలంలో రుణమాఫీ అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు, దళితులకు దళిత బంధు మహిళలకు మహాలక్ష్మి అందించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎవరు అధైర్య పడవద్దు అని కార్యకర్తలకు అండగా ఉంటామని అన్నారు. ఇకనుంచి నియోజవర్గంలో ప్రతిపక్ష పాత్ర పోషిస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని అన్నారు. అనంతరం పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న నాయకులు మాజీ అధ్యక్షులు గొల్లపల్లి రాంరెడ్డి, మోత్కుపల్లి ప్రవీణ్, పాండవుల భాను ప్రకాష్ గౌడ్, అర్కాల గాల్ రెడ్డి, నకీర్తి కనకరాజు లను పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ మండల పార్టీ నాయకులు ఏకగ్రీవ తీర్మానంతో తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, చామకూర గోపాల్ గౌడ్, సట్టు తిరుమలేష్, బిడుద వీరేశం, గుంటి మధుసూదన్ రెడ్డి, సంధిలా భాస్కర్ గౌడ్, పల్లె సంతోష్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకాలు చేపట్టాలని కలెక్టరేట్ ఎదుట నిరసన



భువనగిరి జిల్లా ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): యాదాద్రి భువనగిరి జిల్లా వారసత్వంగా వస్తున్న విఆర్ఏలను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట మంగళవారం వీఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు. జీవో 81 ప్రకారం 61 సంవత్సరాలు పైబడిన వృద్ధుల వారసులకి విధులలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వారసత్వంగా వస్తున్నటువంటి వీఆర్ఏలను గత ప్రభుత్వం జీవో 81 ప్రకారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ రెవెన్యూ సహాయాకులు (వీఆర్ఏ) 20555 మందికి గాను,16758 నీ విధుల్లోకి తీసుకున్నారని, మిగతా 3797 మందిని ఎలక్షన్ల తర్వాత తీసుకుంటామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జిల్లా కలెక్టర్ కి అనేకసార్లు వినతిపత్రం ఇచ్చిన పట్టించుకోవడంలేదనీ తెలిపారు. తమ కుటుంబాలని పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని, యాదాద్రి జిల్లాలో 160 మందికి పైగా ఉన్న తమను ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వెంటనే మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వీఆర్ఏలు పాల్గొన్నారు.

# గిరిజన సంక్షేమ హాస్టల్లోనీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**– ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి శివకుమార్ గౌడ్**



రంగారెడ్డి, జూలై 09(తీన్మార్ న్యూస్): రంగారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ హాస్టల్లోనీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలనీ ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో డిటిడిఓ రామేశ్వరి దేవి కి వినతిపత్రం అందజేశార. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుకునే గిరిజన విద్యార్థులకు హాస్టల్లో నాణ్యమైన భోజనం, మంచి త్రాగునీరు అందించాలని గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ చదువుకోవడానికి వస్తున్నారని వారికి నాణ్యమైన ఆహారం లేకపోతే చదువుకు దూరమయ్యె అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. అంతేగాక హాస్టల్ వార్డెన్స్ కి రెండు అంతకన్నా ఎక్కువ హాస్టల్లో ఇన్చార్జి ఇవ్వడం వల్ల విద్యార్థులకు కల్పించాల్సిన వసతులపై శ్రద్ధ వహించడం లేదని వారు ఆగ్రహం తెలియజేశారు. కడ్తల్, మైసిగండి గిరిజన ఆశ్రమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు సరిగ్గా లేవని, విద్యార్థులు రాత్రి సమయాలలో భయభ్రాంతులకు గురవుతున్నారని వారు తెలియజేశారు. అదేవిధంగా అన్ని వసతులతో కూడిన పక్కా భవనాలను నిర్మించాలని వారు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం విద్యార్థులకు సరైన ఆహారం అందించకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు గండికోట శివ, వివేక్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

# రాజాపేట బిఆర్ఎస్ మండల అధ్యక్షులుగా సట్టు తిరుమలేష్



రాజాపేట, జూలై 09((తీన్మార్ న్యూస్): రాజపేట మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా రాజపేటకు చెందిన రాష్ట్ర రజక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సట్టు తిరుమలేషను నియమించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, డిసిసిబి మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మంగళవారం మండల పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో అందరి ఆమోదం మేరకు ఏకగ్రీవ తీర్మానం తో సట్టు తిరుమలేషను ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీ చరిత్రలో మొట్టమొదటిసారి రాజపేట మండల కేంద్రానికి అదేవిధంగా బీసీ నాయకునికి మండల పార్టీ అధ్యక్ష పదవి అప్పగించడం ఇదే మొదటిసారి బీసీ రజక సంఘం నాయకునికి, పార్టీ పట్ల అంకితభావంతో నిరంతరం పనిచేసే ప్రజల కోసం సమస్యల పరిష్కారం కోసం శ్రమించే సట్టు తిరుమలేశ నియామకం పట్ల పార్టీలోని ప్రజాప్రతినిధులు నాయకులు కార్యకర్తలు అభిమానులు అన్ని గ్రామాల నుండి అభినందనలు తెలిపి సత్కరించారు. అన్ని పార్టీల నుండి ముఖ్యంగా బీసీ సంఘాలు బీసీ నాయకుల నుండి సానుకూల స్పందనతోపాటు సట్టు తిరుమలేషను సోషల్ మీడియా ద్వారా నేరుగా ఫోన్ల ద్వారా అభినందించారు. సత్కరించారు. ఈ సందర్భంగా గొంగిడి మహేందర్ రెడ్డి కి కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ మరింత అభివృద్ధికి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగాడుతో తన పదవికి పూర్తి న్యాయం చేస్తానని సట్టు తిరుమలేశ ఈ సందర్భంగా చెబుతూ గొంగిడి మహేందర్ రెడ్డి కి, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత టిఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

**– వన మహోత్సవ కార్యక్రమలో భారీగా మొక్కలు నాటాలి**

**– జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జండగే ఆదేశాలు జారీ**





భువనగిరి జిల్లా ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మున్సిపాలిటీలలో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, వన మహోత్సవ కార్యక్రమాలలో వివిధ శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ హనుమంత్ కే. జండగే అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు ఆయన జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో సమావేశమై మాట్లాడుతూ మున్సిపల్ వార్డులలో నీరు నిల్వఉండకుండా చూడాలని, గతంలో నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలను గుర్తించి తిరిగి నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని, లార్వాను ప్రారంభ దశలోనే నిర్మూలించేలా చర్యలు తీసుకోవాలని, ఆయిల్ బాల్స్, ఫాగ్గింగ్, ఆంటీ లార్వా స్ప్రేయింగ్ పనులు నిర్వహించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని, దోమల బాధ కలుగకుండా డెంగ్యూ, మలేరియా వ్యాధుల నివారణకు కృషి చేయాలని, మురికి కాలువలలో పూడికతీత పనులు పెద్ద ఎత్తున చేపట్టాలని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖలకు కేటాయించిన మొక్కలు నాటే లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలలో, రోడ్లకిరువైపులా పెద్ద మొక్కలు నాటాలని, అర్బన్ ప్లాంటింగ్ సంబంధించి మున్సిపల్ వార్డులకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పి.బెన్ షాలోమ్, కే.గంగాధర్, రెవిన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, శేఖర్ రెడ్డి, జిల్లా అటవీ అధికారి పద్మజా రాణి, జిల్లా పరిషత్ సిఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి ఎం.ఏ. కృష్ణన్, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా పంచాయత్ అధికారి సునంద, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ పాపారావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, జిల్లా ఎక్సైజ్ అధికారి సైదులు, పంచాయత్ రాజ్ ఇ.ఇ. వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెట్టింగ్ అధికారి సబిత, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎయిర్ పోర్ట్ భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకుంటాం

**భూములు కోల్పోయేవారితో ఎమ్మెల్యే సమావేశం**

**పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**





పరకాల, జూలై 09 (తీన్మార్ న్యూస్): పరకాల నియోజకవర్గం పరిధిలోని ఖిలా వరంగల్ మండలం గుంటూరుపల్లి, గాడిపల్లి పరిధిలో మామునూరు ఎయిర్పోర్ట్ నిర్మాణంలో భూములు కోల్పోయే రైతుతో, ఎయిర్పోర్ట్ నిర్మాణ ఆవరణలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. తొలిదశలో విమానాల రాకపోకలకు వీలుగా భూమిని సేకరించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంతో అధికారులు, ఆయా గ్రామాల రైతులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసారంగం పైన ఆధారపడి ఉన్న మధ్యతరగతి కుటుంబాలు మావని రైతులు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకోవచ్చారు. భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించే విషయంలో ప్రభుత్వం ప్రకటించిన భూముల విలువ తక్కువగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేయడంతో, రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు. గాడేపల్లిలో సుమారు 12 మంది ఇండ్లు కోల్పోతుండడంతో, వారి ఇండ్లను సందర్శించి ఇంటి యజమానులకు తగు నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. భూములు కోల్పోతున్న అన్నదాతలు వరంగల్ పట్టణానికి చేరువలోనే ఉన్న గుంటూరు పల్లికి అతి సమీపంలోనే రహదారి పోయే విధంగా చూడాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు.

# కలెక్టరేట్ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

**గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి**

**త్వరలోనే మహిళలకు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు ఏర్పాటు**

**రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క)**



ములుగు, జూలై 09 (తీన్మార్ న్యూస్): గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, వారికి కావాల్సిన ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. మంగళవారం ములుగు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు జిల్లాలో కలెక్టరేట్, ఏరియ ఆసుపత్రి, ఐటిడిఏ, రామప్ప దేవాలయం ఆవరణంలలో మొత్తం నాలుగు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయనున్నామని అందులో భాగంగా కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్లాలో మొదటి ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నా మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ సంవత్సరం 20 వేల కోట్ల రూపాయలు రుణాలు బ్యాంక్ లీకేజీ ద్వారా అందించడం జరుగుతుందని, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభించడం జరుగుతుందని నూతనమైన ఆహార పదార్థాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే మహిళలు మి సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్, డైరీ ఫాంలు, సోలార్ లైట్స్, అదేవిధంగా 60 లక్షల పాఠశాల ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్ లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు దేశానికే ఒక బ్రాండ్ గా నిలవాలని , స్థానిక వనరులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ ను త్వరలోనే రూపొంది స్తామని, రానున్న ఐదు సంవత్సరాలలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు, క్యాంటీన్ల ఏర్పాటు కు అన్ని రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించడంతోపాటు వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, మహేందర్ జి, డిఆర్డిఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా అధికారులు, ప్రియదర్శినిమహిళా పొదుపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికలు దురాక్రమణలకు గురికాకుండా కాపాడాలి

**భూకబ్జాలపై దర్యాప్తు చేసి, చర్యలు తీసుకోవాలి**

**అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)కు మాజీ ఎమ్మెల్యే వినతి**



మేడ్చల్ మల్కాజ్ గిరి, జూలై 09 (తీన్మార్ న్యూస్): అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి.విజేందర్ రెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీ కూన శ్రీశైలం గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని కుత్బుల్లాపూర్, మూసాపేట్ మండలాల పరిధిలోని మూసాపేట్, గాజులరామారం గ్రామాల సరిహద్దుల్లో ఉన్న సర్వే నంబర్ 348/1 గల పరికి చెరువును మరియు హిందూ, ముస్లిం స్మశాన వాటికలు దురాక్రమణలకు గురికాకుండా కాపాడాలని, ఇట్టి భూకబ్జా లపై సమగ్ర దర్యాప్తు చేసి, భూకబ్జాదారుల పై చర్యలు తీసుకోవాల్సిందిగా కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గారు అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కోరారు. దానికి అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి, మాజీ మున్సిల్ వైస్ చైర్మన్ లక్ష్మా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఓరుగంటి క్రిష్ణా గౌడ్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టివేత



పాలకీడు, జూలై 9 (తీన్మార్ న్యూస్): అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యన్ని మంగళవారం పాలకీడు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం సుమారు మూడు గంటల సమయంలో బొలెరో మ్యాక్స్ ప్లస్ వెహికల్ కోమటికుంట నుండి జాన్పాడు మీదుగా మునగ నర్సయ్య తండ్రి దుర్గారావు వయసు 32 సంవత్సరాలు అను వ్యక్తి దాచేపల్లికి అక్రమంగా తరలిస్తున్న సుమారు 40 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకోవడం జరిగిందని ఇట్టి విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మండలం ఎస్ఐ లక్ష్మి నర్సయ్య తెలిపారు.

# జంతువుల దత్తత కోసం...

వరంగల్, పక్షులు, జంతువుల సంరక్షణ, నిర్వహణలో పాలుపంచుకోవడానికి పక్షులు, జంతు ప్రేమికులకు ఆహ్వానం పలుకుతుంది వరంగల్ లోని జులాజికల్ పార్క్. స్వయంగా పక్షుల ఆలన పాలన చూసుకోలేని వారికి, వాటి సంరక్షణ లో భాగస్వాములు కావాలనుకునే వారికి జూ పార్కు పక్షులను, జంతువులను దత్తత ఇస్తుంది. సంరక్షణ, దత్తత ను మూడు, ఆరు, సంవత్సరం ఎవరి వీలును బట్టి వారు దత్తత తీసుకోవచ్చు.వరంగల్ నగరంలోని హంటర్ రోడ్ లో ఉన్న కాకతీయ జూలాజికల్ పార్క్ రాష్ట్రంలోనే రెండవ అతిపెద్ద జూలాజికల్ పార్క్ గా పేరుంది. ఈ పార్కులో చిరుతపులి, మొసలి, జంగిల్ క్యాట్, సాంబార్ జింక, మౌస్ డీర్, నెమలి, తెల్ల నెమలి, ప్రేమ పక్షులు, కాకాటిల్స్, క్రిష్ణ జింక, వైట్ రియా పక్షి, నక్షత్ర తాబేలు ఇలా 440 కి పైగా జంతు, పక్షి జాతులు సందర్శకుల సందర్శనార్థం అందుబాటులో ఉన్నాయి. కాకతీయ జూలాజికల్ పార్క్ సందర్శకులకు విజ్ఞానం, వినోదాన్ని పంచడంతోపాటు జూ పార్క్ సంరక్షణలో భాగంగా అనేక జంతు, పక్షులను దత్తత ఇస్తుంది. సంరక్షణ, నిర్వహణలో భాగస్వాములను చేయడానికి 2016 సంవత్సరం నుండి దత్తత స్కీంను మొదలు పెట్టారు జూ పార్క్ అధికారులు. 92 ఎకరాల్లో విస్తరించి ఉన్న జూలాజికల్ పార్క్ లో అనువైన వాతావరణంలో జంతువులు, పక్షులు ఆలన పాలన సాగుతుంది. వీటి సంరక్షణ లో భాగంగా ఖరీదైన పౌష్టికాహారం, వైద్యం అందించడం జరుగుతుంది. జంతువుల, పక్షుల దత్తతను తీసుకొని వాటి నిర్వహణ, సంరక్షణ లో భాగస్వాములను చేయడానికి కార్పొరేట్ సంస్థలను, విద్య సంస్థలను, స్వచ్ఛంద సంస్థలను, జంతు, పక్షు ప్రేమికులను, పౌరులను ఆహ్వానిస్తుంది. దత్తత తీసుకొనే వారికి భారం కాకుండా మూడు, ఆరు నెలలు, సంవత్సరం స్కీమ్ లను అందుబాటులో ఉంచారు పారెస్ట్ అధికారులు. పక్షులు, జంతువుల ఎన్ క్లోజర్ల వద్ద దత్తత తీసుకున్న వారి పేర్లను బోర్డు రూపంలో పెడతారు. వాటికి అందించే ఫుడ్ మెను ను దాతలకు వివరిస్తారు. అంతేకాకుండా పక్షుల, జంతువుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకోవచ్చని జులాజికల్ పార్క్ రేంజర్ మయూరి చెప్పారు. అంతే కాకుండా దత్తత తీసుకున్న దాతల ఫ్యామిలీకి సంవత్సరంలో రెండు లేదా మూడు సార్లు జూ పార్క్ ను ఫ్రీ చూడడానికి అవకాశం కల్పిస్తున్నట్లు అధికారి తెలిపారు. 2016 నుండి ఇప్పటి వరకు 90 మంది వివిధ జంతువులు, పక్షులను దత్తత తీసుకున్నారని జూ అధికారి చెప్పారు. దాతలు ముందుకు రావడానికి జూ పార్కులో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పెద్ద సంఖ్యలో దాతలు ముందుకు రావాలని అధికారి మయూరి అభిప్రాయపడ్డారు.జూ అధికారులు దాతలకు మరో అవకాశం కల్పిస్తున్నారు. దత్తత తీసుకున్న పత్రాలను ఇన్ కమ్ టాక్స్ లో చూపించుకోవచ్చని మయూరి తెలిపారు. దత్తత తీసుకున్న దాతలు వారి వారి కాల పరిమితిని బట్టి జూలాజికల్ పార్క్ వరంగల్పేరిట చెక్కు లేదా క్యాష్ అకౌంట్లో వేయవచ్చని ఆమె తెలిపారు.పక్షులు జంతువులను దత్తత తీసుకోవాలనుకొనే దాతలు ఈ ఫోన్ నంబర్లను లేదా జూ పార్కు వెబ్ సైట్ ను సందర్శిస్తే పూర్తి వివరాలు చెప్పడంతో పాటు తెలుస్తాయని జూ పార్క్ రేంజర్ మయూరి చెప్పారు.

944 081 0093 జిల్లా ఫారెస్ట్ అధికారి హన్మకొండ.
8019919959 ఫారెస్ట్ రేంజర్ జులాజికల్ పార్క్.
778037 89 72 సెక్షన్ ఆఫీసర్ జులాజికల్ పార్క్.

# మంత్రి సీతక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఇంజ నరేష్



రాజాపేట, జూలై 09(తీన్మార్ న్యూస్): ములుగు శాసన సభ్యులు, పంచాయతీరాజ్ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ ( సీతక్క) 53వ, జన్మదిన వరంగల్ జిల్లాలోని ములుగు లోని జంగాలపల్లి లో సీతక్క ఆలేరు నియోజకవర్గ నాయకులు మంగళవారం కలిసారు. మండల యూత్ అధ్యక్షులు ఇంజ నరేష్ ఆధ్వర్యంలో కలిసిన వారి లో కళ్ళెం పాండు, ఇంజ శ్రీరాములు, యాదగిరిగుట్ట ఏస్సీ సెల్ అధ్యక్షులు బుడీద మధు, గ్రామ శాఖ కాకల్ల శ్రీకాంత్, గోలీ ఉదయ్ కిరణ్, ఇంజ చీంటు, ఇంజ కార్తిక్, తదితర నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్సై నరేందర్ ఆధ్వర్యంలో బాధితునికి సెల్ ఫోన్ అప్పగింత

**– సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్ రికవరీ**



ఆత్మకూర్, జులై 09(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండలం, దేవరపల్లి గ్రామానికి చెందిన వినోద్ గత సంవత్సరం ఆగస్టు నెల పదవ తేదీన దేవరపల్లి గ్రామం నుంచి ఆత్మకూరు కి బైక్ పై వెళ్తుండగా తన మొబైల్ ఫోన్ పడిపోయింది. వెంటనే స్థానిక ఆత్మకూర్ పోలీసుల సహాయంతో సీఈఐఆర్ నూతన పోర్టల్ లో అప్లై చేయగా ఆత్మకూర్ సబ్ ఇన్స్పెక్టర్ నరేందర్ ఆధ్వర్యంలో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధ్యతని ఫోన్ ని మంగళవారం ఆత్మకూర్ పోలీసులు ట్రస్ట్ చేసి రికవరీ చేసి బాధితునికి ఎస్సై నరేందర్ మొబైల్ ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా తమ సెల్ ఫోన్ ని ఎవరైనా దొంగలించినా లేదా పోగొట్టుకున్నట్లయితే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా అట్టి నెంబర్ను https://www.ceir.gov.in వెబ్ సైట్ లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందుపరచాలని అలా చేసినట్లయితే త్వరగా వారి మొబైల్స్ ని పట్టుకోవడం జరుగుతుందని కావున ప్రజలు సిఈఐఆర్ నూతన అప్లికేషన్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# సెకండ్ లీడర్స్ కు ప్రాధాన్యం...

హైదరాబాద్: గతేడాది జరిగిన అసెంబ్లీ, ఇటీవలే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితి ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఓటమి బాధ నుంచి పూర్తిగా తేలక ముందే నేతల జంపింగ్ లు ఆ పార్టీకి కొత్త తలనొప్పిని తెచ్చిపెడుతుంది. ఎవరు ఎప్పుడు పార్టీ మరుతారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. గత కొన్ని రోజులుగా ఆ పార్టీలో ఇదే తంతు కొనసాగుతూ వస్తుంది. కేసీఆర్ కు అత్యంత సన్నిహితులుగా ఉన్న నేతలే పార్టీ ఫిరాయిస్తున్నారట.పార్టీలో అసలేం జరుగుతోందో అధినేతకే అంతుచిక్కని రహస్యంగా మారింది. పార్టీ మారేవాళ్లు అధినేతకు కనీస సమాచారాన్ని కూడా ఇవ్వకుండా ఫిరయిస్తున్నారట. కాగా గత వారం రోజుల నుంచి కేసీఆర్ ఆయన ఫాంహౌస్ నుంచే దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలతో ఫాంహౌస్ లో చర్చలు జరిపారు. అందులో భాగంగానే ఇకపై పార్టీ స్ట్రాటజీ పూర్తిగా మార్చాలని కేసీఆర్ భావిస్తున్నారట. ఇకపై పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న యువతకు, నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ నిర్ణయించుకున్నారు.దాదాపు రెండు దశాబ్దాల పాటు తెలంగాణ రాజకీయాలను శాసిస్తూ వచ్చిన కేసీఆర్.....పార్టీ పగ్గాలు స్వయంగా ఆయన చేతబట్టి అనేక అన్యూహ విజయాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచారు. అయితే గతేడాది జరిగిన అసెంబ్లీ, ఇటీవలే జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు కేసీఆర్ ను రాజకీయంగా మరింత కుంగదీశాయి అనే చెప్పాలి. ఓటమి తరువాత కేసీఆర్ జిల్లాల వారీగా నిర్వహించిన సమీక్షా సమావేశాలు, క్షేత్ర స్థాయి నేతలతో జరిపిన చర్చలు తరువాత కేసీఆర్ ఓ కంక్లూజన్ కు వచ్చారట. అందులో భాగంగానే ఇప్పటి నుంచి ఆ పార్టీలో యువ నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన వెంట నడిచిన యువతకు కీలక బాధ్యతలు ఇవ్వాలని భావిస్తున్నారట. దీంతో పాటు ఉద్యమ సమయంలో కీలక పాత్ర వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, వివిధ సామాజిక వర్గ నేతలకు దగ్గరయ్యేలా కేసీఆర్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారట.గతంలో వివిధ కార్పొరేషన్లు, కమిషన్ల ఛైర్మన్లు, సభ్యులుగా పని చేసి అనుభవం కలిగిన యువ నేతలను పార్టీ తరఫున జరిగే కీలక కార్యక్రమాల్లో వారికి అగ్ర తాంబూలం ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నారు. యువ నేతల్లో ముఖ్యంగా మన్నె కృష్ణాంక్, బాల్క సుమన్, గదరీ కిషోర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ వంటి ఉద్యమ నేతలకు పార్టీ కమిటీల్లో చోటు కల్పించాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు. వీటన్నిటితో పాటు ప్రస్తుతం కార్యనిర్వహక అధ్యక్షుడుగా ఉన్న కేటీఆర్, హరీష్ రావు వంటి అగ్రనేతలను పార్టీ పరంగా విభజించి వారికి కీలక బాధ్యతలు అప్పజెప్పాలని చూస్తున్నారు. కాగా రాబోయే పార్టీ ఆవిర్భావ సభ వేడుకలను ఘనంగా నిర్వహించి, అందులో యువతకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయి కార్యకర్తలకు భరోసా ఇవ్వనున్నారు. వీటితో పాటు సోషల్ మీడియాను మునపటి కంటే ఆక్టివ్ చేసి కాంగ్రెస్, బీజేపీలను ధీటుగా ఎదుర్కోవాలని చూస్తున్నారు. మొత్తానికి బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కేసీఆర్ కంకణం కట్టుకున్నారు.

# ఆత్మకూరు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులుగా కౌకుంట్ల బాలేశ్వర గుప్తా



ఆత్మకూర్, జులై 09(తీన్మార్ న్యూస్): ఆత్మకూర్ పట్టణ కేంద్రంలో స్థానిక కన్యక పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షులుగా పట్టణానికి చెందిన కౌకుంట్ల బాలేశ్వర గుప్తా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బాలేశ్వర్ గుప్త ఎన్నిక పట్ల పలు ఆర్యవైశ్య సంఘాలు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ సందర్భంగా బాలేశ్వర్ గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘ ఐక్యతను అభివృద్ధికి సహాయ సహకారాలను తోడ్పడుతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

# ఘనంగా మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు



**సీతక్కకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినా అచ్చునూరి కిషన్**

ములుగు, జూలై 09 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలోని ఎంఆర్ ఫంక్షన్ హాల్'లో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యురాలు డాక్టర్ సీతక్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో తీన్మార్ మల్లన్న టీమ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు అచ్చునూరి కిషన్, టీమ్ సభ్యులు కలిసి మంత్రి సీతక్కను శాలువాతో సన్మానించి, పూలబొకే ఇచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తీన్మార్ మల్లన్న టీమ్ సభ్యులు బొల్లె రమేష్, ముత్తే బోయిన ప్రసాద్, విజయ్, రాకేష్, శ్రీను, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ఆత్మహత్య బాధాకరం

**పుట్టింది బతకడానికి చావడానికి కాదు**

**నిష్పాక్షికంగా విచారణ.. బాధ్యులు ఎవరైనా కఠిన చర్యలు**

**అంతా నా వాళ్లే.. రాజకీయాలకు స్థానం లేదు**

**రైతు ప్రభాకర్ కుటుంబానికి న్యాయం చేస్తాం, అన్ని విధాల ఆదుకుంటాం**

చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చేపల సొసైటీ, ఇరిగేషన్ కు సంబంధించి.. తన భూమి, వేసిన మెరకను తొలగించారని రైతు ప్రభాకర్ మనస్థాపన చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మీడియా ద్వారా మిగతా వారిద్వారా తెలిసింది. రైతు తండ్రి తో మాట్లాడాను, వారి శ్రీమతితో పిల్లలతో మాట్లాడాను, జరిగిన సంఘటన చాలా బాధాకరం, ప్రాణం చాలా విలువైనది, మనం పుట్టింది బతకడానికి కానీ చావడానికి కాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామంలో ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన రైతు ప్రభాకర్ కుటుంబాన్ని ఆయన పరామర్శించిన అనంతరం స్థానికంగా మీడియాతో మాట్లాడారు. ఎంత పెద్ద సమస్య ఉన్న ఎక్కడో ఒకచోట పరిష్కారం మార్గం వెతుకొని బతకడానికి ప్రయత్నం చేయాలి తప్ప ఎవరు ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను అన్నారు. రైతును ఆత్మహత్యకు పురిగొల్పి.. దానికి దారి తీసిన పరిస్థితులు కల్పించిన వ్యక్తులు ఎవరైనా సరే, ఎంత పెద్ద వారైనా సరే.. నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులైన వారి పైన చట్టపరంగా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించానని తెలిపారు. ఇక్కడ అందరూ మా వాళ్లే.. అందరూ నా వాళ్లే.. జరిగిన పొరపాటుకు ఎవరూ కారణమైన సరే.. ఎవరిని ఉపేక్షించేది లేదు, ఎవరిని వదిలిపెట్టేది లేదు అన్నారు. బాధిత కుటుంబానికి తప్పనిసరిగా న్యాయం జరిగేటట్టుగా .. ఆత్మహత్యకు ప్రేరేపించిన వారిపై చర్యలు తీసుకోవడమే కాకుండా... రైతు ప్రభాకర్ భూమికి సంబంధించిన సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం అన్నారు.చేపల సొసైటీ, ఇరిగేషన్, రెవెన్యూ వారితో మాట్లాడి సమస్య ఏంటో తెలుసుకొని.. శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ను ఆదేశించాను అన్నారు. పిల్లలు చదువుకోవడానికి అవసరమైన సహాయ సహకారాలు పూర్తిగా ఏర్పాటు చేస్తానని, పిల్లలు బాగా చదువుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. వారు చదువుకున్నంత కాలం చదివిస్తాను ఇందులో ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. ఇతరత్రా సమస్యలకు సంబంధించి కుటుంబ సభ్యులు రాసి ఇచ్చారు వాటిని పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటాం ఎలాంటి ఇబ్బంది లేదు అన్నారు. ఇక్కడ అందరూ మావాళ్లే.. ఇటువంటి కేసుల్లో అసలు పార్టీలకు సంబంధమే లేదు... స్థానం లేదు ఇది మానవత్వంతో అందరూ చూడాల్సిన సంఘటన.. ఏ పార్టీ వారైనా మనిషే.. మనిషి ప్రాణం విలువైనది అని పేర్కొన్నారు. ఈ సంఘటనలో ఎవరిని ఉపేక్షించేది లేదని తెలిపారు.

# ఐఐటి విద్యార్థికి లాప్ టాప్ బహుకరణ



**– తూడి ఇన్ఫ్రా మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాసరెడ్డి**

వనపర్తి ప్రతినిధి, జూలై 09(తీన్మార్ న్యూస్): రేవల్లి మండలం, బండరావిబాకుల గ్రామానికి చెందిన జలగం భద్రయ్య కుమారుడు జలగం సాయి రుషీత్ కాన్పూర్ ఐఐటి లో సీటు సంపాదించారు. నిరుపేద కుటుంబానికి చెందిన సాయి రిషిత్ కు పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, తూడి ఇన్ఫ్ర మేనేజింగ్ పార్ట్నర్ శ్రీనివాస్ రెడ్డి గారు ల్యాప్టాప్ ను బహుకరించారు. ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన విద్యార్థికి సూచించారు.

# డీఎస్పీ నూతన మండలాధ్యక్షుడి ఎన్నిక..

బెజ్జంకి :ధర్మ సమాజ్ పార్టీ నూతన మండలాధ్యక్షుడిగా మండల పరిధిలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన మహంకాళి సురేశ్ ఎన్నికైనట్టు జిల్లాధ్యక్షుడు బోయిని సదన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన డీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నూతన మండలాధ్యక్షుడి ఎన్నిక నిర్వహించామని సదన్ కుమార్ తెలిపారు.

# 98 వేల సీట్లకు కౌన్సెలింగ్

హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ సీట్ల విషయంలో అధికారుల లెక్కలు ఓ కొలిక్కి వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 173 ఇంజనీరింగ్ కాలేజీల్లో 98,296 సీట్లున్నట్టు అధికారులు తెలిపారు. వీటిల్లో కన్వీనర్ కోటా కింద 70,307 సీట్లుండగా, మేనేజ్‌మెంట్ కోటా కింద 27,989 సీట్లు అందుబాటు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు 2024?25 విద్యాసంవత్సరం భర్తీచేసే ఇంజనీరింగ్ సీట్లను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన వెల్లడించారు. ఈ ఏడాది బీటెక్ సీట్లల్లో సగానికి పైగా సీట్లు సీఎస్ఈ అనుబంధ బ్రాంచీల్లోనే ఉండటం గమనార్హం. కన్వీనర్ కోటాలోని మొత్తం సీట్లల్లో దాదాపు 41,968 (59. 69 శాతం) సీట్లు సీఎస్ఈ అనుబంధ బ్రాంచ్‌లలో ఉన్నాయి. సీఎస్ఈ కోర్సుల్లో సీట్లు గణనీయంగా పెరుగడంతో మిగతా బ్రాంచీల్లో సీట్లు తగ్గిపోతున్నాయి. యూనివర్సిటీలు, యూనివర్సిటీ కాన్‌స్టిట్యూయంట్ కాలేజీలు 21 ఉన్నాయి. వీటిల్లో 7,153 సీట్లు ఉండగా, కన్వీనర్ కోటాలో 6,603 సీట్లున్నాయి. ఇక 152 ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో 91,143 ఉండగా, కన్వీనర్ కోటాకి 63,704 సీట్లున్నాయి.త్వరలోనే మరికొన్ని కోర్సులకు కూడా అనుమతులొచ్చే అవకాశం ఉందని, దీంతో సీట్ల సంఖ్య పెరగవచ్చని అధికారులు చెబుతున్నారు. సివిల్, మెకానికల్, ఈఈఈ వంటి కోర్ బ్రాంచిల్లో సీట్లను తగ్గించి, సీఎస్ఈలో సీట్లను పెంచుకునే దిశలో సమాలోచనలు చేస్తున్నారు. ఇక జులై 7న జరిగిన మొదటి విడత ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌కు 91,530 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో 25,041 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకున్నారు. జులై13 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. వెబ్ ఆప్షన్లు నేటి నుంచి ప్రారంభమవుతాయి. జులై 15 వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. జులై 19లోపు మొదటి విడత సీట్ల కేటాయింపు ముగుస్తుందని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన వివరించారు.


# పోలీసుల అదుపులో మాజీ మావోయిస్టు

కరీంనగర్ జిల్లా: మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు, సికాస వ్యవస్థాపక కమిటీ సభ్యుడు మహమ్మద్ హుస్సేన్ రియాజ్ సుధాకర్ అలియాస్ రమాకాంత్ ను జమ్మికుంటలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 30 సంవత్సరాలు సుదీర్ఘంగా ఉద్యమంలో అయన పనిచేసాడు. జార్ఖండ్ రాష్ట్రంలో అరెస్ట్ అయిన హుస్సేన్ 12 సంవత్సరాలు జైలు జీవితం అనుభవించాడు. అనారోగ్య కారణాలతో బెయిల్ పై విడుదలై 10 సంత్సరాలుగా జమ్మికుంటలో సాధరణ జీవితం గడుపుతున్నాడు. అతడిని వెంటనే విడుదల చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# బీఆర్ఎస్ విలీనమేనా,,,,,?

## ఏం జరుగుతోంది...

హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ దూకుడు పెంచింది. బిఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా చేయాలని ప్లాన్ చేస్తోంది. అటు అసెంబ్లీలో ఇటు కౌన్సిల్ లో బిఆర్ఎస్ పక్షాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవాలని గట్టి కసరత్తు చేస్తున్నారు హస్తం పార్టీ నేతలు. ఆ దిశగా ఇప్పటికే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హస్తం గూటికి చేరారు. ఇంతకీ అసెంబ్లీ, మండలిలో బిఆర్ఎస్ ఎల్పీ విలీనం సాధ్యపడుతుందా? అన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఏకంగా రెండు సభల్లోనూ బీఆర్ఎస్ సభా పక్షాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవడంపై ఫోకస్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి అందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. ఐతే బీఆర్ఎస్ ఎల్పీ విలీనానికి కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సఫలమవుతాయన్నదే చర్చకు దారితీస్తోంది.ఏదైనా పార్టీ సభాపక్షాన్ని విలీనం చేసుకోవాలంటే మూడింట రెండొంతుల బలం ఉండాలి. అదే ప్రతిపక్ష హోదా తీసేయడానికి మొత్తం సభ్యుల సంఖ్యలో పది శాతం ఆ పార్టీకి లేకుండా చేయాలి. అసెంబ్లీలో ప్రస్తుతం బీఆర్ఎస్‌కు 38 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 26 మంది పార్టీని వీడితే శాసనసభాపక్షం విలీనం అయినట్లు ప్రకటించొచ్చు. అదేవిధంగా 119 స్థానాల అసెంబ్లీలో ప్రతిపక్ష పార్టీకి కనీసం 12 మంది సభ్యులు ఉండాలి. 12 మంది కన్నా తక్కువ ఉంటే ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వరు. ఐతే ప్రస్తుతం కాంగ్రెస్ ప్లాన్స్ గమనిస్తే బిఆర్ఎస్‌కు ప్రతిపక్ష హోదా లేకుండా ఏకంగా ఆ పార్టీ శాసనసభా పక్షాన్ని విలీనం చేసుకోవాలని చూస్తోంది. రాజ్యాంగంలోని షెడ్యూల్ 10 ప్రకారం శాసనసభాపక్షం విలీనం కావాలంటే మూడింట రెండొంతుల సభ్యులు మారాల్సిఉంది. గతంలో 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని శాసనసభా పక్షాన్ని విలీనం చేసుకున్నట్లుగా ఇప్పుడు బిఆర్ఎస్ శాసనసభా పక్షాన్ని కూడా విలీనం చేసుకోవాలని చూస్తోంది. చట్టంలో ఉన్న ప్రొవిజన్స్‌ను అనుకూలంగా మార్చుకొని బీఆర్ఎస్ ఎల్పీని కాంగ్రెస్‌లో విలీనం చేసుకోవాలని ఆలోచనలతో అడుగులు వేస్తోంది.ఒక పార్టీ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలు లేదా ఎమ్మెల్సీలు ఇతర పార్టీలోకి వెళ్తే.. పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తిస్తుంది. ఫిరాయింపుల చట్టం కింద పదవి కోల్పోవాల్సి వస్తుంది. అయితే ఒక



పార్టీ శాసనసభాపక్షం విలీనమైతే ఫిరాయింపుల చట్టం నుంచి తప్పించుకోవచ్చు. 2018లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇదే చట్టం ఆసరాగా చేసుకుని 12 మంది బిఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేశారు. ఇప్పుడు సేమ్ టు సేమ్ సీఎం రేవంత్ రెడ్డి ఇదే వ్యూహాన్ని అమలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్‌కు చెక్ చెప్పాలని చూస్తున్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలు మాత్రమే చేరారు. బీఆర్ఎస్ ఎల్పీ విలీనం కావాలంటే ఇంకా 20 మంది చేరాల్సివుంటుంది. అంతమంది కాంగ్రెస్‌లో చేరతారా? లేదా? అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.ఇక మండలిలో బిఆర్ఎస్ ఎల్పీ విలీనం కావాలంటే భారీ కసరత్తే చేయాల్సి ఉంటుంది. మండలిలో మొత్తం 40 మంది సభ్యులకు గాను ప్రస్తుతం 38 మందే ఉన్నారు. గవర్నర్ కోటాలో రెండు ఖాళీలు ఉన్నాయి. ఈ రెండూ ప్రభుత్వం సిఫార్సు చేసిన వారికే దక్కే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ ఖాతాలో పడటం ఖాయంగా చెబుతున్నారు. ఇక ప్రస్తుతం ఉన్న 38 మందిలో 29 మంది సభ్యులు బీఆర్ఎస్ వారే.. మండలిలో బిఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కావాలంటే ఆరుగురు నామినేటెడ్ ఎమ్మెల్యేలను తీసేసినా మిగిలిన 25 మంది బిఆర్ ఎస్ ఎమ్మెల్సీల్లో కనీసం 17 మంది కాంగ్రెస్లో చేరాల్సిందే. ఇప్పటి వరకు బీఆర్ఎస్ నుంచి 8 మంది ఎమ్మెల్సీలు మాత్రమే కాంగ్రెస్ పార్టీలో మారారు. పార్లమెంట్ ఎన్నికల కంటే ముందే కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా బస్వరాజు సారయ్య, ఎగ్గె మల్లేశం, బొగ్గవరపు దయానంద్, ఎంఎస్ ప్రభాకర్, భానుప్రసాద్, దండే విఠల్ కాంగ్రెస్‌లో గూటికి చేరారు. మండలిలో బిఆర్ఎస్ ఎల్పీ కాంగ్రెస్‌లో విలీనం కావాలంటే ఇంకా 9 మంది ఎమ్మెల్సీలు చేరాల్సి ఉంటుంది.ప్రస్తుతానికి మండలిలో కాంగ్రెస్‌కు అధికారికంగా నలుగురు సభ్యులు ఉండగా, కొత్తగా చేరిన ఎమ్మెల్సీలతో ఆ సంఖ్య 12కి చేరింది. ఇద్దరు ఇండిపెండెంట్లు, ఇద్దరు ఎంఐఎం సభ్యులు కూడా కాంగ్రెస్కే మద్దతు ఇస్తున్నారు. ఇక గవర్నర్ కోటా వచ్చే ఇద్దరుతో కలిపితే మండలిలో కాంగ్రెస్ బలం 18కి చేరుతుంది. మండలిలో బిల్లులు పాస్ కావాలంటే కాంగ్రెస్‌కు ఇంకా ముగ్గురు ఎమ్మెల్సీలు అవసరమవుతారు. భవిష్యత్‌లో ఏర్పడే ఖాళీలతో ఈ బలం సంపాదించుకోవచ్చు. కానీ, కాంగ్రెస్ లక్ష్యం మాత్రం బీఆర్ఎస్ సభాపక్షాన్ని విలీనం చేసుకోవడమే అన్నట్లు కదులుతోంది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ వ్యూహాన్ని నిలువరించేందుకు బీఆర్ఎస్ కూడా ప్రతివ్యూహాలను రచిస్తోంది. ఎమ్మెల్యేలు, ఎంపీలు కొందరు పార్టీని వీడినా, సభాపక్షం విలీనమయ్యే పరిస్థితులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. పార్టీ వీడుతారని అనుమానం ఉన్న వారిని మాజీ సీఎం కేసీఆర్ స్వయంగా పిలిచి మాట్లాడుతున్నారు. ఇప్పటికే ఒకరిద్దరు ఎమ్మెల్యేలు పార్టీ మారతారనే ప్రచారం జరుగుతున్నా, అధినేతతోపాటు బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడటంతో వారు పునరాలోచనలో పడినట్లు చెబుతున్నారు.ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ నిర్వహించగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. వీరు ఏ కారణం చేత కేసీఆర్‌తో సమావేశానికి హాజరుకాలేదో అన్న విషయాన్ని ఆరా తీస్తోంది పార్టీ. గైర్హాజరు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారా? లేక వ్యక్తిగత కారణాల వల్లో.. సమయం లేక రాలేకపోయారా? అన్నది తేలాల్సివుంది. మొత్తానికి పార్లమెంట్ ఎన్నికల తర్వాత కూడా తెలంగాణ రాజకీయం వాడివేడిగా కొనసాగుతుండంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ గులాబీ పార్టీని వెంటాడుతోంది. మరోవైపు కాంగ్రెస్‌లో వలసలపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ చేరికను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యతిరేకించగా, ఆయనను పార్టీ పెద్దలు సముదాయించారు. ఇక తాజాగా గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిపోయారు. మొత్తానికి వలస రాజకీయం ఇరుపార్టీల్లోనూ హీట్ పుట్టిస్తోంది.

# పొన్నం వర్సెస్ కౌశిక్,,,

కరీంనగర్: కరీంనగర్ జిల్లా రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్, హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మధ్య పొలిటికల్ వార్ పతాకస్థాయికి చేరింది. రెండు నెలలుగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను టార్గెట్‌గా చేసుకుని విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత దూకుడు పెంచిన కౌశిక్ రెడ్డి రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఏ చిన్న అవకాశం దొరికినా తనదైన స్టైల్లో దూసుకుపోతున్నారు. ఏకంగా ఓ బ్లాక్ బుక్ రాస్తున్నానంటూ కాంగ్రెస్ నేతలకు వార్నింగ్‌లు ఇస్తున్నారు.ఇక కాంగ్రెస్ చేజార్చుకున్న హుజురాబాద్‌లో పాగా వేసేందుకు మంత్రి పొన్నం సపోర్ట్‌తో హస్తం నేతలు జోరు చూపిస్తున్నారు. దీంతో తన నియెజకవర్గంలో ఇన్వాల్వ్ అవుతున్నాడనే కారణంతో మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అటాక్ మొదలు పెట్టారు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి. కౌశిక్ నేరుగానే పొన్నంపై ఎటాక్ చేస్తుండగా, మంత్రి పొన్నం మాత్రం ఎక్కడా చలించడంలేదు. కౌశిక్‌కు కౌంటర్‌గా కాంగ్రెస్ ద్వితీయశ్రేణి నేతలతో మాటల దాడి చేయిస్తూ తనదైన రాజకీయం చేస్తున్నారు.పొన్నం ప్రభాకర్, కౌశిక్ రెడ్డి ఇద్దరూ ఒకప్పుడు కాంగ్రెస్‌లో కలిసి పనిచేశారు. కౌశిక్ రెడ్డి బిఆర్ఎస్‌లో చేరి? మొన్నటిదాకా ఎమ్మెల్సీగా?ఇప్పుడు ఎమ్మెల్యేగా హుజూరాబాద్ రాజకీయాల్లో దూకుడు మీద సాగుతున్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకపోవడంతో ప్రతిపక్ష నేతగా మిగిలిపోయారు. దీంతో ఇప్పుడు ఇద్దరూ బద్ధ శత్రువులుగా వ్యవహరిస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు గాలం వేస్తున్న కాంగ్రెస్ కౌశిక్‌రెడ్డి విషయంలో రివర్స్‌లో వెళుతున్నట్లు కనిపిస్తోంది. కౌశిక్‌రెడ్డి దూకుడుతో హస్తం హైకమాండ్ హుజురాబాద్‌పై ప్రత్యేకంగా ఫోకస్ చేసింది. పార్టీ ఆదేశాలతో హుజురాబాద్లో మంత్రి పొన్నం జోక్యం పెరిగింది. దీన్ని సీరియస్‌గా తీసుకున్న కౌశిక్ రెడ్డి? మంత్రిపై వాగ్బాణాలు సంధిస్తున్నారు. రామగుండం థర్మల్ విద్యుత్ కేంద్రం బూడిద దందాలో పొన్నంకి ముడుపులు ముడుతున్నాయంటూ సంచలన ఆరోపణలు చేశారు.దీనికి కౌంటర్‌గా కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు అక్రమ వసూళ్లకు పాల్పడ్డారంటూ అటాక్ చేస్తున్నారు పొన్నం ఫాలోవర్స్. దీంతో వివాదం కాస్త ముదిరి సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకునే స్థాయికి చేరింది. హుజురాబాద్లో ఒక రోజంతా హడావిడి నడిచింది.ఇక తన నియోజకవర్గంలో విద్యాశాఖ అధికారులతో సమీక్షిస్తే హాజరైన అధికారులకు డీఈవో నోటీసులివ్వడం, తనపై కేసులు పెట్టడం వెనుక పొన్నం పాత్ర ఉందని మండిపడుతున్నారు కౌశిక్‌రెడ్డి. అదేవిధంగా కళ్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేయడంపైనా వివాదం కోర్టుకెక్కింది. మంత్రి పొన్నం కనుసన్నల్లోనే హుజూరాబాద్ నియోజకవర్గ వ్యవహారాలు నడుస్తుండటం ఎమ్మెల్యేకు మరింత అసంతృప్తికి గురిచేస్తోంది.ఈ కారణంతోనే మంత్రిని టార్గెట్ చేస్తూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి పదేపదే విమర్శల దాడి చేస్తున్నారు. ఐతే ఎమ్మెల్యే ఏం మాట్లాడినా, మంత్రి పొన్నం మాత్రం అస్సలు పట్టించుకోవడం లేదు. రాజకీయాల్లో తనకంటే జూనియర్ అయిన కౌశిక్ రెడ్డి ఆరోపణలకు తాను స్పందించకుండా, అనుచరులతోనే కౌంటర్లు



ఇప్పిస్తున్నారు. కౌశిక్‌రెడ్డికి కౌంటర్ ఇచ్చి తన స్థాయిని తగ్గించుకోను అన్నట్లు మంత్రి పొన్నం వ్యవహరిస్తున్నారు. అయితే కౌశిక్ రెడ్డి మాత్రం తగ్గేదే లేదంటూ మంత్రిపై రోజురోజుకు విమర్శల దాడి పెంచుతున్నారు. ఈ ఎపిసోడ్‌ను పరిశీలిస్తున్నవారు సీనియర్లను టార్గెట్ చేస్తేనే తన పొలిటికల్ మైలేజ్ పెరుగుతుందనే ఆలోచనే ఎమ్మెల్యే విమర్శల వెనుక ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో సీనియర్ నేత ఈటల రాజేందర్ విషయంలోనూ? ఆ తర్వాత అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనా ఇలాగే కౌశిక్ రెడ్డి విమర్శలు చేసిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఏదేమైనా మొత్తానికి మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేగా సాగుతున్న పొలిటికల్ ఫైట్ తో కరీంనగర్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి.

# టూ టైర్ సిటీస్ కు గ'మ్మత్తు...'

కరీంనగర్: మత్తు గమ్మత్తుగా మారింది. గంజాయి గుప్పుమంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యువత గంజాయి మత్తులో జోగుతోంది. ఎక్కడ చూసిన గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇక్కడ అక్కడ అనే తేడా లేదు.. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుతున్నాయి. పోలీసుల కళ్లు గప్పి స్మగ్లర్లు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు, యువకులు గంజాయి బారిన పడి మత్తులో ఊగుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. డ్రగ్స్ మహమ్మారిపై ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించిన నేపథ్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిఘా పెంచారు.ఉమ్మడి జిల్లాలో గంజాయి అక్రమ వ్యాపారం దర్జాగా సాగుతోంది. దేశ భవిష్యత్ ను తీర్చిదిద్దాల్సిన యువత ఈ గంజాయి మత్తు బారిన పడి చిత్తవుతున్నది. రోజురోజుకు గంజాయి బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. పోలీసు యంత్రాంగం నిత్యం దాడులు నిర్వహిస్తూ.. యువత, మైనర్లకు కౌన్సిలింగ్ ఇస్తూ తల్లిదండ్రులను చైతన్యపరిచే ప్రయత్నం చేస్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. పేద, మధ్య తరగతి యువతను ఆకర్షించి మత్తులో దింపి వారిచే మరికొందరిని ఆకర్షించడం ద్వారా గంజాయి విక్రయాలను గణనీయంగా పెంచుకుంటున్నారు. మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు కూడా ఇప్పుడు గంజాయి బారిన పడుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతుండటంతో ఇటు తల్లిదండ్రులు.. అటు పోలీసు వర్గాలు కలవరపడుతున్నాయి. అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఒకవైపు పోలీసు యంత్రాంగం నిరంతరం తలమునకలవుతుంటే.. కొత్త కొత్త మార్గాల్లో సరికొత్త రూపాల్లో గంజాయిని జిల్లాలోకి తరలిస్తూ వ్యాపారులు పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.గంజాయి రవాణా విపరీతంగా పెరిగింది. కరీంనగర్ తో పాటు, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలో యథేచ్ఛగా గంజాయి లభిస్తోందని తెలుస్తోంది. వివిధ మార్గాల్లో గంజాయిని రవాణా చేస్తున్నారు. జగిత్యాలలో ఎక్కడ పడితే అక్కడ గంజాయిని సరఫరా చేస్తున్నారు. పోలీసులు నిరంతరం దాడులు చేస్తూ పట్టుకున్నారు. ఇటీవల కాలంలో గంజాయిని పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా కరీంనగర్ లో కూడా వివిధ ప్రాం తాల్లో అక్రమంగా రవాణా చేస్తున్న గంజాయిని పట్టుకున్నారు. నగరం... నడిబొడ్డున ఈ దందా దర్జాగా కొనసాగుతోంది.. కట్టారాంపూర్ లోని ఓ మైదానంలో నిత్యం గంజాయిని సేవిస్తున్నారు. అదే విధంగా ఆదర్శనగర్, సుభాష్ నగర్, మారుతీనగర్, విద్యానగర్ ఖాళీ ప్రాంతాల్లో గంజాయిని పిల్చుతున్నారు. నగర శివారులో ప్రొఫెషనల్ విద్యార్థులు ఈ మత్తుకు అలవాటుపడుతున్నారని తెలుస్తోంది. చిగురు మామిడి మండలంలో సుందరగిరి గ్రామ శివారులో గంజాయి మత్తులో యువకులు ఓ వ్యక్తి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. మత్తులో బీరు సీసాతో దాడి చేసి కటకటాలపాలయ్యారు.సరదా కోసమే.. స్నేహితుల ఒత్తిడి కోసమే ఒక్క సారిగా గంజాయి సేవిస్తే మత్తుకు పూర్తిగా అలవాటు పడుతున్నారు. సాయంత్రం వేళల్లో ఎల్ఎండి శివారులో గంజాయి తాగుతున్నారు. గతంలో గంజాయి మత్తులో వివిధ నేరాలకు పాల్పడ్డ సంఘటనలు ఉన్నాయి. కొంత మంది మైనర్లు కూడా ఈ గంజాయికి అలవాటు పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నగర శివారులో పోలీసులు పెట్రోలింగ్ ను పెంచారు... గతంలో గంజాయి సేవించి దొరికిన యువతకు కౌన్సిలింగ్ నిర్వహించారు పోలీసులు... వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.. అయితే.. ఏ చిన్న అనుమానం వచ్చినా, తమకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు పోలీసులు. అదే విధంగా పలు స్వచ్ఛంద సంస్థలు ఈ మత్తు నుంచి ముక్తి చేయడానికి అవగాహన కల్పిస్తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న గంజాయి రవాణా, సమాజంపై తీవ్రప్రభావం చూపుతోంది. యువత చెడిపోతుంది... ఈ విషయంలో.. ప్రభుత్వం మరింత కఠిన చర్యలు తీసుకోవాలని పలు స్వచ్ఛంద సంస్థలు కోరుతున్నాయి.రాష్ట్ర సరిహద్దు నుంచి యథేచ్ఛగా గంజాయి రవాణా అవుతుంది. కొంతమంది గంజాయి రవాణాను వ్యాపారంగా మార్చుకొని లక్షలు సంపాదిస్తున్నారు. చెక్ పోస్ట్ అధికారుల కళ్లు గప్పి రాష్ట్రంలో అడుగుపెట్టిన తర్వాత జిల్లాల వారీగా గంజాయిని వివిధ రూపాల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా గంజాయి సాగు కాకున్నా, ఒడిశా, ఏపీ, చతీష్ గడ్ నుంచి రవాణా అవుతుందని తెలుస్తోంది. మత్తుకు అలవాటు పడిన వారి జాబితా ముందే సేకరించి ఉండటంతో ఒక్కో ప్రాంతంలో ఏ మేరకు గంజాయి అమ్మకాలకు డిమాండ్ ఉందో గుర్తించి ఆ మేరకు సరఫరా చేస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు. చాక్లెట్ రూపంలో గంజాయి విక్రయిస్తు వేములవాడలో ఒడిశాకు చెందిన వ్యక్తి అరెస్టు అయ్యారు. ఇటీవల కరీంనగర్ శివారులో 70 కిలోల గంజాయిను పట్టుకున్నారు. అలాగే సిరిసిల్లలో 4 కిలోలకు పైగా గంజాయిని పట్టుకున్నారు. జగిత్యాలలో మైనర్లు గంజాయికి అలవాటు పడితే.. కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ మత్తు కారణంగా నేరాలకు పాల్పడుతున్నారు. దొంగతనాలు, దాడులు చేస్తున్నారు. గంజాయి సేవించిన వారు నేరాలకు పాల్పడుతున్నారని.. పోలీసులు చెబుతున్నారు. శివారు ప్రాంతాల్లోనే అధికంగా ఈ మత్తును సేవిస్తున్నారు.. గ్రామీణ ప్రాంతాల్లో కూడా మత్తుకు క్రమేపీ యువకులు అలవాటు పడుతున్నారు. ఇప్పుడు సామాజిక సమస్యగా మారింది.. ప్రభుత్వం సత్వరమే స్పందించి.. గంజాయి నివారణకు కఠిన చర్యలు. తీసుకోవాలని స్వచంద సంస్థలు కోరుతున్నాయి.

## మేడ్చల్ లో ఘోర రోడ్డు ప్రమాదం..

హైదరాబాద్: హైదరాబాద్ మేడ్చల్ జిల్లా లో ఈరోజు ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కీసర పోలీస్ స్టేషన్ పరిధి లోని ఔటర్ రింగ్ రోడ్డుపై కారు అదుపు తప్పడంతో శిక్షణలో ఉన్న విమాన పైలట్ శ్రీకరన్ రెడ్డి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. కారులో ఉన్న శ్రీకారన్ రెడ్డి యాదగిరిగుట్టకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలు స్తుంది.యాక్సిడెంట్ పై సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డెడ్ బాడీని రికవరీ చేశారు. మృతుడు శ్రీకరన్ రెడ్డి స్వస్థ లం గజ్వేల్ వాసిగా గుర్తిం చారు. నేరెడ్ మిట్ ప్రాంతం లో కుటుంబ సభ్యులు స్థిరపడ్డారు. బ్యాంకాక్ లో శిక్షణ పొందుతున్న పైలట్ శ్రీకరన్ రెడ్డి, గత వారం రోజుల క్రితం తన ఇంటికి వచ్చాడు. యాదగిరిగుట్ట కు వెళ్లి వస్తా అని ఇంట్లో చెప్పిఇవ్వాళ తెల్లవారు జామున 4 గంటల ప్రాంతంలో ఇంట్లో నుండి బయలుదేరాడని కుటుంబ సభ్యులు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు...

## ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు



అక్రమ నిర్మాణాలను కూల్చి వేసిన అధికారులు

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలంలో అక్రమ నిర్మాణాల పై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. కబ్జా కోరులు కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చి వేశారు. హిమాయత్ సాగర్ సర్వే నెంబర్ 37 లో గల 1000 గజాల స్థలంతో పాటు కిస్మత్ పూర్ సర్వే నెంబర్ 132 లో వెలసిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. సోమవారం తెల్లవారుజామున జెసిబిల సహాయంతో నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని గండిపేట తహసీల్దారు తెలిపారు.

## స్త్రీలపై జరిగే హింసను అరికట్టి, వారికి అండగా ఉండాలి



-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి: బాలికలు, స్త్రీలపై జరిగే హింస నివారణకు మనమంతా కృషి చేసి వారికి అండగా ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్త్రీలపై హింస నివారణకు, మహిళా సంరక్షణ చట్టాలు తెలుపుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా రూపొందించిన పలు పోస్టర్లను అదనపు కలెక్టర్ లు జే.అరుణశ్రీ, జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మహిళలకు ఫోన్ ద్వారా సలహాలను, సహాయాన్ని అందించుటకు మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 అందుబాటులో ఉన్నదని, గృహహింస, వరకట్న వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, లైంగిక హింస, ఆడపిల్లల అమ్మకం, రవాణా నివారణ కోసం మహిళా హెల్ప్ లైన్ నెంబర్ 181 కు ఫోన్ చేయాలని, మహిళలకు అవసరమైన సలహా, కౌన్సిలింగ్, రక్షణ చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ తెలిపారు. సఖీ కేంద్రం ద్వారా మహిళలకు వైద్య సేవలు, పోలీస్ సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి, కౌన్సెలింగ్ అందించడం జరుగుతుందని అన్నారు. బాలికలు, స్త్రీలపై జరిగే హింసను నివారించి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, జిల్లా అధికారులు, సఖీ సెంటర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## 8 ఏళ్ళ చిన్నారిపై 50 వృద్ధుడి లైంగిక దాడి

రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ (పెత్తుల్లా) గ్రామంలో ఘోరం జరిగింది. గ్రామంలో ఆరుబయట ఆడుకుంటున్న 8 సంవత్సరాల పాప కు చాక్లెట్,డబ్బుల ఆశ చూపించి 50 సం!! వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. నిందితుడు బోడ నర్సింహ(50). పాప కేకలు వేయటం తో నర్సింహ్మ పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. పోలీసులు నిందితుడి పై పొక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం బాలికను ఆసుపత్రికి తరలించారు. పోలీస్ స్టేషన్ ముందు బాలిక బంధువులు, నాయిబ్రహ్మాన్ సంఘ నేతలు ఆందోళనకు దిగారు. బాధిత త కుటుంబాన్ని ఆదుకోని, నిందితున్ని కఠినంగా శిక్షించాలంటున్న నిరసనకారులు డిమాండ్ చేసారు.

## గంగాపురిలో నివాస గృహాలను చుట్టుముట్టిన వరద నీరు

-యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటిని తొలగించే ఏర్పాటు చేసిన మునిసిపల్ సిబ్బంది

మంథని: మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నివాస గృహాల్లోకి వరద నీరు వచ్చి చేరింది. గంగాపురి స్టేజి వద్ద ప్రధాన డ్రైనేజీ కురుకుపోవడంతో ఈ సమస్య తలెత్తింది. వరద నీరు ఇండ్లకు చుట్టుముట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వరద నీటి సమస్యను మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రు రమా సురేష్ రెడ్డికి తెలియజేయడంతో తమ సిబ్బందిని వెంటనే సంఘటన స్థలానికి పంపించి జెసిబి తో సహాయంతో యుద్ధ ప్రాతిపదికన వరద నీరు బయటకి వెళ్లడానికి తగు ఏర్పాటు చేశారు. పేరుకుపోయిన పూడికను తొలగించి వరద నీరు నిలవకుండా తగు చర్యలు తీసుకున్నారు. గంగపురి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి వరద నీరు ఇళ్లలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# భారీగా పెరిగిన ఇంజనీరింగ్ సీట్లు

### ఆందోళనలో జేఎన్టీయూ

హైదరాబాద్, తెలంగాణలో ఇంజనీరింగ్ కోర్సులకు సంబంధించి కంప్యూటర్ సైన్స్, ఐటీ తదితర సీట్ల సంఖ్య భారీగా పెరగడంపై జేఎన్‌టీయూ హైదారబాద్ ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో కోర్ ఇంజినీరింగ్ బ్రాంచీలను తగ్గిస్తూ.. సీఎస్‌ఈ, ఐటీ సంబంధిత విభాగాల్లో సీట్లను విపరీతంగా పెంచడం మంచిది కాదని తెలిపింది. ఇది భవిష్యత్తులో తీవ్ర విపరిణామాలకు దారితీస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు ఏఐసీటీఈకి జేఎన్‌టీయూహెచ్ లేఖ రాసింది. సీట్లు పెంచితే అధ్యాపకుల కొరత తలెత్తుతుందని లేఖలో పేర్కొంది. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం సూచన మేరకు జేఎన్‌టీయూ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావు ఈ లేఖ రాశారు.రాష్ట్రంలో కొత్త కళాశాలలు, సీట్ల పెంపుకు సంబంధించిన అనుమతుల విధివిధానాలపై ఏఐసీటీఈ గత జనవరిలోనే హ్యాండ్ బుక్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అపరిమిత సీట్లు మంజూరు చేస్తామని అందులో స్పష్టం చేసింది. ఆ మేరకు సీట్లపెంపుకు దరఖాస్తు చేసుకున్న కళాశాలలకు ఏఐసీటీఈ అనుమతులిచ్చింది. ఈ నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ ఏఐసీటీఈకి లేఖ రాయడంపై కళాశాలల యాజమాన్యాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. అనుమతుల ప్రక్రియ అంతా పూర్తయ్యాక లేఖ రాయడం ఏంటని ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్రంలో ఒకపక్క ఇంజినీరింగ్ కాలేజీల సంఖ్య భారీగా పెరగ్గా.. ఆ మేరకు సీట్ల సంఖ్య కూడా భారీగా పెరగనుంది. ముఖ్యంగా డిమాండ్ ఉన్న కంప్యూటర్ సైన్స్,ఐటీ సంబంధిత బ్రాంచీల్లో ఏకంగా 20,500 సీట్లు పెరగనున్నాయి. అయితే పెరగిని ఈ సీట్లు కేవలం జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని కళాశాలల్లోనివి మాత్రమే కావడం గమనార్హం. ఇక ఉస్మానియా యూనివర్సిటీ కాకతీయ యూనివర్సిటీల్లో కలిపితే సీట్ల సంఖ్య మరింత పెరుగుతాయి.రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ జులై 4న ప్రారంభమైన సంగతి తెలిసిందే. విద్యార్థులు జులై 12 వరకు నిర్ణీత ప్రాసెసింగ్ ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంది. వీరికి జులై 6 నుంచి 13 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించనున్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయినవారు కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపిక కోసం జులై 8 నుంచి 15 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. వీరికి జులై 19న మొదటి దశ ఇంజినీరింగ్ సీట్లను కేటాయించనున్నారు. సీట్లు పొందినవారు జులై 19 నుంచి 23 మధ్య సంబంధిత కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. అయితే జులై 8 నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో జేఎన్‌టీయూహెచ్ పరిధిలో దాదాపు 88 వేల సీట్లకు అనుమతిచ్చినట్లు తెలుస్తోంది. అందులో ఇతర కోర్ బ్రాంచ్‌లలో సుమారు 7 వేల సీట్లను కుదించుకొని సీఎస్‌ఈ తదితర డిమాండ్ ఉన్న బ్రాంచీల్లో సీట్ల సంఖ్య పెంచుకున్నట్లు తెలుస్తోంది. బీటెక్ కోర్సుల్లో చేరేవారు మొదటి ఛాయిస్‌గా కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత కోర్సులనే ఎంచుకుంటున్నారు. దీంతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో కన్వీనర్ కోటా సీట్లు సగం కూడా నిండలేదు. గతేడాది మూడు కోర్ బ్రాంచీల్లో 12,751 సీట్లుండగా.. అందులో కేవలం 5,838 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఇక మేనేజ్‌మెంట్ కోటాలో చేరే వారే కరవయ్యారు. ఆ సీట్లను కూడా కలిపితే మొత్తం సీట్ల భర్తీ 40 శాతానికి

# ఈ సారి ఉద్యోగులకు గుడ్ న్యూస్

న్యూఢిల్లీ, ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్ (బడ్జెట్ 2024) ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. జూలై 22న పార్లమెంటులో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టవచ్చని భావిస్తున్నారు. అయితే తేదీ మాత్రం ఇంకా ఖరారు కాలేదు. ఇదిలా ఉంటే ఈ సారి బడ్జెట్ లో పీఎఫ్ ఖాతాదారులకు ప్రభుత్వం భారీ గిఫ్ట్ ఇవ్వొచ్చని, వేతన పరిమితిని పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఉద్యోగుల వేతన పరిమితిని పెంచవచ్చని ఒక నివేదిక పేర్కొంది. దశాబ్దకాలంగా ఈ పరిమితిని రూ.15,000గా ఉంచిన కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కొన్నేళ్లుగా ప్రావిడెంట్ ఫండ్ పరిమితిని పెంచే అంశాన్ని పరిశీలిస్తోంది. ప్రభుత్వం ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచే అవకాశం ఉందని ఇందుకు కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసిందని తెలుస్తోంది.

చివరి మార్పు 2014, సెప్టెంబర్ లో జరిగింది

పీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వం మద్దతిచ్చే పొదుపు, విరమణ నిధి. ఇది సాధారణంగా ఉద్యోగులు, వారి యజమాన్యుల భాగస్వామ్యంతో స్థాపించబడుతుంది. ఉద్యోగి, కార్మికుల విరమణ సమయంలో ఆర్థిక భద్రత కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఇది ఉద్యోగులకు సురక్షితమైన, పన్ను-ప్రభావవంతమైన విరమణ ప్రయోజనాల్లో ఒకటిగా పరిగణించబడుతుంది. ప్రావిడెంట్ ఫండ్ పరిమితి ప్రస్తుతం రూ.15,000 గా ఉంది. ఉద్యోగుల భవిష్య నిధి కింద కంట్రిబ్యూషన్ గరిష్ట పరిమితిని కేంద్రం చివరిసారిగా 2014, సెప్టెంబర్ 1న రూ.6,500కు సవరించింది.

ఈపీఎఫ్ 1 ముఖ్యమైన విషయాలు

1 ఉద్యోగులు, కార్మికుల కోసం కేంద్రం అమలు చేస్తున్న సామాజిక భద్రతా పథకం ఇది.

2. మీ జీతం నెలకు రూ.15,000 అయితే ఈ స్కీమ్ లో చేరడం తప్పనిసరి.

3. మీరు ఉద్యోగం చేస్తే, మీ కంపెనీ మీ జీతం నుంచి కొంత భాగాన్ని మీ ఈపీఎపీ ఖాతాలో వేస్తుంది.

4. ఈ డబ్బు కేంద్ర ప్రభుత్వ నిధిలో ఉంటుంది. అవసరమైన సమయంలో వడ్డీతో ఉపయోగించవచ్చు.

5. మీ కంపెనీ మీకు ఈపీఎఫ్ అకౌంట్ నెంబర్ ఇస్తుంది. ఈ ఖాతా నెంబరు కూడా మీకు బ్యాంకు ఖాతా వంటిది, ఎందుకంటే మీ డబ్బు మీ భవిష్యత్తు కోసం ఇందులో ఉంది.

వేతన పరిమితిని ఎప్పుడు, ఎంత పెంచారు..

1 నవంబర్, 1952 నుంచి 31 మే, 1957 వరకు రూ.300

1 జూన్, 1957 నుంచి 30 డిసెంబర్, 1962 రూ.500

31 డిసెంబర్, 1962 నుంచి 10 డిసెంబర్, 1976 రూ.1000

11 డిసెంబర్, 1976 నుండి 31 ఆగస్టు, 1985 రూ.1600

1 సెప్టెంబర్, 1985 నుంచి అక్టోబర్ 31, 1990 రూ.2500

1 నవంబర్, 1990 నుండి 30 సెప్టెంబర్, 1994 రూ.3500

1 అక్టోబర్, 1994 నుండి 31 మే, 2011 వరకు రూ.5 వేలు

1 జూన్, 2001 నుండి 31 ఆగస్టు, 2014 వరకు రూ.6500

ప్రస్తుతం 1 సెప్టెంబర్ 2014 నాటికి రూ.15 వేలు

ఈపీఎఫ్ఓ చట్టాన్ని పరిశీలిస్తే ఏ ఉద్యోగికైనా బేస్ పే, డీఏలో 12 శాతం పీఎఫ్ ఖాతాలోనే ఉంటుంది. దీనిపై సంబంధిత కంపెనీ కూడా అదే మొత్తాన్ని అంటే 12 శాతం ఉద్యోగి పీఎఫ్ ఖాతాలో జమ చేస్తుంది. అయితే కంపెనీ చేసిన కంట్రిబ్యూషన్ లో 3.67 శాతం ఈపీఎఫ్ ఖాతాకు, మిగిలిన 8.33 శాతం పెన్షన్ స్కీమ్ కు వెళ్తోంది.

# బ్రిటన్ పార్లమెంట్ లో 26 మంది బార్న్ ఇండియన్స్

హైదరాబాద్, బ్రిటన్ పార్లమెంటు ఎన్నికల్లో భారత సంతతి నేతలు సత్తా చాటారు. పార్లమెంటు దిగువ సభ అయిన హౌస్ ఆఫ్ కామన్‌లో భారత సంతతి హవా కొనసాగింది. భారత మూలాలు ఉన్న 26 మంది అక్కడి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. తెలుగు సంతతికి చెందిన ఉదయ్ నాగరాజు, చంద్ర కన్నెగంటి మాత్రం ఓడిపోయారు.ఈ ఎన్నికల్లో గెలుపొందిన భారత సంతతి నేతల్లో ప్రధాని రిషి సునాక్ ముందున్నారు. రిచ్మండ్ అండ్ నార్తర్న్ అలర్టన్ స్థానం నుంచి విజయం సాధించారు. మాజీ హోం మంత్రులు సుయెల్లా బ్రేవర్మన్, ప్రీతి పటేల్ తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. భారత సంతతికి చెందిన క్లెయిర్ కౌటిన్హో కూడా విజయం సాధించారు. సౌత్‌వెస్ట్ హెర్డ్‌ఫోర్డ్ షైర్ నుంచి కన్జర్వేటివ్ నేత గగన్ మొహీంద్ర, లైసెస్టర్ ఈస్ట్ నుంచి శివానిరాజా విజయం సాధించారు. లేబర్ పార్టీకి చెందిన రాజేశ్ అగర్వాల్‌పై శివాని విజయం సాధించారు. కన్జర్వేటివ్ పార్టీకి చెందిన శైలేష్ వారా, తొలిసారి పోటీలో దిగిన అమిత్ జోగియాలు స్వల్ప ఓట?ల తేడాతో ఓడిపోయారు.భారత సంతతి విజేతల్లో ఎక్కువ మంది వామపక్ష లేబర్ పార్టీ నుంచే విజయం సాధించారు. బ్రిటన్ పార్లమెంటులో అడుగు పెట్టబోతున్నారు. వీరిలో సీమా మల్హోత్రా (వాల్సాల్ నియోజకవర్గం), వాలెరీ వాజ్ (బోక్స్ విచ్).. ఆమె సోదరి కీత్ వాజ్, లీసా నాండీ (విగాన్)లు భారీ మెజార్టీతో గెలుపొందారు. బ్రిటిష్ సిక్కు ఎంపీలు ప్రీత్ కౌర్ గిల్, తన్మంజిత్ సింగ్ దేహిలు మరోసారి విజయం సాధించారు. నావెందు మిశ్రా, రదిమా విటోమ్‌లు లేబర్ పార్టీ నుంచి భారీ మెజార్టీతో తమ స్థానాలను నిలబెట్టుకున్నారు. ఇదిలా ఉంటే.. 12 మంది బ్రిటన్ పార్లమెంటులో తొలిసారి అడుగు పెట్టబోతున్నారు. లేబర్ పార్టీకి చెందిన జాస్ అథ్వాల్, బిలినీ శంకర్, సత్వీర్ కౌర్, హర్జోత్ ఉప్పల్, వారిందర్ జస్, గురిందర్ జోసన్, కనిష్క నారాయణ్, సోనియా కుమార్, సురీనా బ్రాకెన్‌బ్రిడ్జ్, కిరిత్ ఎంట్విజిల్, జీవన్ సంధేర్, సోజాన్ జోసెఫ్ తొలిసారిగా బ్రిటన్ పార్లమెంటులో అడుగుపెట్టనున్నారు

# నేతన్నల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

### నేత పరిశ్రమ యజమానులు ఆసాములు కార్మికులతో సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..

రాజన్న సిరిసిల్ల: జిల్లాలోని నేతన్నల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. సిరిసిల్ల పవర్ లూం సమస్యలపై చర్చించేందుకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులతో సమావేశం చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సమావేశానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై పరిశ్రమలో నెలకొన్న సమస్యలు, కార్మికులకు ఉపాధి, భవిషత్ కార్యాచరణ పై కాటన్, పాలిస్టర్, సైజింగ్, కార్మిక సంఘాల నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. పవర్లూమ్ పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వాలని, పాత బకాయిలు మాఫీ చేయాలని, బతుకమ్మ చీరల బకాయిలు విడుదల చేయాలని, కామన్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని, క్లాత్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టాలని, యువతకు ఆధునిక టెక్నాలజీ పై శిక్షణ ఇప్పించాలని, సబ్సిడీ పై ఆధునిక పవర్ లూం యంత్రాలు ఇవ్వాలని, యారన్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, బకాయి ఉన్న విద్యుత్ బిల్లులు మాఫీ చేయాలని, నూతన క్లాత్ ఉత్పత్తుల ఆర్డర్లు ప్రభుత్వం ఇవ్వాలని వారు కోరారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. నేత కార్మికుల సమస్యలపై చర్చించిన అంశాలు అన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పరిశ్రమలో వచ్చిన సమస్యలు పరిష్కరిస్తామని, త్వరలో మరో సమావేశం ఏర్పాటు చేసి భవిషత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. పరిశ్రమను యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో చేనేత జౌళి శాఖ ఆర్ డీడీ రాఘవరావు, ఏడీ సాగర్, పరిశ్రమ యజమానులు, ఆసాములు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

# బీటీ బ్యాచ్ ఎంత పని చేసిందో.....

హైదరాబాద్: చేర్చుకుంటున్నప్పుడు బాగానే ఉంటుంది.. కానీ అధికారం పోయిన తర్వాత ఎవరూ ఉండరు. ఇది అన్ని పార్టీలకూ అప్లయ్ అవుతుంది. నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన తప్పులే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంది. నాడు తమ పార్టీ నుంచి వెళ్లి బీఆర్ఎస్ లో పదవులు పొంది, పదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీని విమర్శించిన వారిని కూడా వదలడం లేదు. ఎవరిని బడితే వారిని.. వస్తామంటే కండువా కప్పేశామా? లేదా? వాళ్లకు అస్సలు ప్రజల్లో ఇమేజ్ ఉందా? వారివల్ల భవిష్యత్ లో పార్టీకి ఉపయోగం ఉందా? అన్నది ఆలోచించడం లేదు. తాజాగా ఆరుగురు ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ లో చేరారంటే నిజంగా కేసీఆర్ గతంలో చేసిన తప్పులేనని చెప్పక తప్పదు.నాడు కూడా కేసీఆర్ అన్ని రకాలుగా ఊసిపోయిన వాళ్లను తీసుకొచ్చి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. అంతే తప్ప తెలంగాణ ఉద్యమంలో తనతో పాటు తిరిగి, కేసుల్లో ఇరుక్కున్న వారిని మాత్రం పక్కన పెట్టారు. నాడు కేసీఆర్ ఎడా పెడా కాంగ్రెస్, టీడీపీ, కమ్యూనిస్టులు ఇలా ఏ పార్టీని వదలకుండా నేతలను తమలో కలిపేసుకునే ప్రయత్నంలో భాగంగా కండువాలు కప్పారు. పదేళ్లు బాగానే ఉంది. కేసీఆర్ కు ఇదే నేతలు జై కొట్టారు. ఆయనంతటి లీడర్ లేడంటూ పొగిడేశారు. కానీ ఎప్పుడైతే అధికారం కోల్పోయిన వెంటనే తాను పిలిచి పదవులు ఇచ్చిన వాళ్లే నేడు తూచ్ అంటూ జారుకుంటున్నారు. నిజంగా కేసీఆర్ కు తెలిసిరావాల్సిందే. ఆయనకు జరగాల్సిందేనన్నది గులాబీ పార్టీ నుంచి వినిపిస్తున్నాయి.పార్టీ కోసం కష్టపడిన నేతలను పక్కన పెట్టారు. ఉద్యమంలో అన్నీ వదిలి జెండాను పట్టుకున్న నాయకులను వదిలేశారు. గొంతెత్తి అరిచిన లీడర్లను కూడా తోసి పారేశారు. కనీసం నామినేటెడ్ పదవులు ఇవ్వడానికి కూడా పదేళ్లు కేసీఆర్ కు మనసు రాలేదు. కానీ గతంలో ఎప్పుడో గెలిచిన వారిని, కాంగ్రెస్ లో పదవులు పొందిన వారిని తెచ్చుకుని నెత్తిన పెట్టుకున్నారు. ఏదో ఘన కార్యం సాధించినట్లు బిల్డప్ ఇచ్చారు. కాంగ్రెస్ ను ఖాళీ చేశానని జబ్బలు చరుచుకున్నారు. కానీ నేడు ఏమయింది రాత్రికి రాత్రే మకాం మార్చేశారు. వాళ్లకు కావాల్సింది అధికారం. అంతే తప్ప పార్టీ మీద ప్రేమ కాదన్నది ఇప్పటికైనా కేసీఆర్ కు అర్థమయి ఉండాలి. రెడీ అవుతున్న సర్కార్ కాంగ్రెస్ లో చేర్చుకోవడంపై... అయితే ఇదే నేతలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఈ నిలకడలేని, నమ్మకం లేని నేతలను తెచ్చి పెట్టుకుని కేసీఆర్ చేసిన తప్పులనే కాంగ్రెస్ నేతలు చేస్తున్నారా? అని పార్టీ క్యాడర్ నుంచి వినిపిస్తున్న ప్రశ్నలు. వచ్చేవాళ్లంతా తమది కాంగ్రెస్ రక్తమేనని చెబుతున్నప్పటికీ ఈ ఐదేళ్లు ఆ బ్లడ్ వారిలో ఉంటుంది. అధికారం కోల్పోతే తర్వాత బ్లడ్ లేదు.. ఫ్లడ్ వచ్చినట్లు వెళ్లిపోతారన్నది గమనించుకోవాలని కార్యకర్తలు మండిపడుతున్నారు. అయితే శాసనమండలిలో బలం తక్కువగా ఉండటంతో ఏకంగా ఒకేసారి ఆరుగురిని చేర్చుకున్నామని అధికార కాంగ్రెస్ పార్టీ పైకి చెబుతున్నప్పటికీ వీరు ఎప్పటికీ పార్టీకి శాశ్వతం కాదు. అయితే ఆ నిజం తెలిసేలోగా ఐదేళ్లు ముగిసిపోతాయి.మళ్లీ ఇలాంటి నేతలను అధికారంలో బీఆర్ఎస్ వస్తే చేర్చుకోదన్న గ్యారంటీ కూడా ఏమీ లేదు. అదీ అసలు విషయం. మన నేతల బాగోతం.

# రాజకీయాలకతీతంగా ప్రజాసేవ చేస్తా

### – సీపీఎం, (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యాలయాల సందర్శనలో ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

### – సాయిబాబా ఆలయంలో పూజలు, కరుణగిరి చర్చిలో ప్రార్థనలు




ఖమ్మం: రాజకీయ పార్టీలకతీతంగా ప్రజాసేవ చేయడమే తన లక్ష్యమని, అందరివాడిగా ఉండి తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధి సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. ఉదయం ఆయన నగరంలోని వీడీవోస్ కాలనీలో సాయిబాబా దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఖమ్మం రూరల్ మండలం కరుణగిరిలోని ఫోర్త్ ఎంప్లాయిస్ చర్చిని సందర్శించి అక్కడ ప్రార్థన చేశారు. ఆ తర్వాత సీపీఎం, సీపీఐ(మాస్ లైన్) ప్రజాపంథా జిల్లా కార్యాలయాలకు వెళ్లి ఎన్నికలప్పుడు తనకు మద్దతునిచ్చి భారీ విజయానికి సహకరించినందుకు ఆ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు ఎంపీ కి సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ..తన గెలుపును.. అందరి విజయంగా భావిస్తానని కృతజ్ఞతలు తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థిగా ప్రజాస్వామ్య పరిరక్షణకు తనవంతుగా లోక్ సభలో గళం విప్పుతానని అన్నారు. లోక్ సభ లో ప్రతిపక్ష హోదాలో ఉన్న తాము రాహుల్ గాంధీ నేతృత్వంలో ముందుకు సాగుతామని తెలిపారు. ఓ ఎంపీగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా నేరుగా కలిసి విన్నవించొచ్చని అభయం ఇచ్చారు. సీపీఐ(ఎం ఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిరంకుశ బీజేపీని నిలువరించేందుకు ఇండియా కూటమికి మద్దతు ఇచ్చామని, భవిష్యత్తులోనూ ప్రజా వ్యతిరేక పోరాటాలలో కలిసి వస్తామని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్, రైతాంగ సమస్యలను ఈ సందర్భంగా ఎంపీ దృష్టికి తీసుకురాగా.. జిల్లా మంత్రులతో సంప్రదించి త్వరితగతిని పూర్తయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో.. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు కొప్పుల చంద్రశేఖర్ రావు, మిక్కిలినేని నరేందర్, సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, సుబ్బారావు, కళ్యాణనీ వెంకటేశ్వరరావు, బషీరుద్దీన్, డాక్టర్ భారవి, సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెనీకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు రాయల చంద్రశేఖర్ , గుర్రనీ అచ్చయ, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, సీవై.పుల్లయ్య, శివలింగం, కమ్మ కోటి నాగేశ్వరరావు, పుసులూరి నరేందర్ ఝాన్సీ, ఆజాద్, కే.శ్రీను తదితరులు పాల్గొన్నారు

# 100 కోట్ల భోలే బాబా

న్యూఢిల్లీ, యూపీలోని హాథ్రస్ జిల్లాలో జూలై 2న భోలే బాబా నిర్వహించిన సత్సంగ్ లో జరిగిన తొక్కిసలాటలో 121 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం విధితమే. ఇంకా అనేకమంది తీవ్రగాయాల పాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలు ఇప్పటికీ గుండెలవిసేలా రోధిస్తున్నాయి. తల్లిదండ్రు ల్ని పోగొట్టుకున్న పిల్లలు, పిల్లల్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు.. అనాధలుగా మిగిలారు. తాజాగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పరామర్శించారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరుగుతున్నదని సీఎం యోగి ఆదిత్యనాథ్ తెలిపారు.అయితే.. ఘోర దుర్ఘటనకు కారణమైన భోలే బాలా అలియాస్ సూరజ్ పాల్ సింగ్ అలియాస్ నారాయణ్ సాకార్ ఎక్కడున్నాడో ఇంతవరకూ పోలీసులకు తెలియలేదు. భోలే బాబా ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు ఘటనకు బాధ్యుల్ని చేస్తూ.. ఆరుగురిని అరెస్ట్ చేశారు. తాజాగా భోలే బాబా ఆస్తులకు సంబంధించిన ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆయన ఆస్తులు, విలాసాలపై ఒక నేషనల్ మీడియా వెల్లడించిన విషయాలు చూస్తే.. ఎవ్వరికైనా దిమ్మతిరగాల్సిందే. ఆశ్రమంలోని విశ్వసనీయ వర్గాల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం.. భోలే బాబాకు దేశంలో 2 ఆశ్రమాలున్నట్లు గుర్తించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తుల విలువ రూ.100 కోట్ల పైమాటే. సెక్యూరిటీ విషయానికొస్తే.. ప్రజల్లోకి వచ్చేటపుడు 16 మంది వ్యక్తిగత సిబ్బంది ఉంటారు. ఆయన కారుకు ముందు 350 సీసీ బైక్ లపై వెళ్తూ.. రూట్ క్లియర్ చేస్తారు. ఆయన వెనుక 5 నుంచి 30 కార్లతో కాన్వాయ్ ఉంటుంది.మెయిన్ పురిలో ఉన్న ఒక ఆశ్రమంలోనే భోలే బాబా నివాసం. ఆ ఆశ్రమాన్ని హరినగర్ గా పిలుస్తారు. సుమారుగా 13 ఎకరాల్లో నిర్మించారు. భోలే బాబా, అతని భార్య కోసం 6 విలాసవంతమైన గదులుంటాయట. ఆశ్రమం ఎంట్రన్స్ లో దానికి వారాళాలిచ్చిన 200 మంది భక్తుల పేర్లు కనిపిస్తాయని.. రూ.10 వేల నుంచి రూ.2.5 లక్షల వరకూ విరాళమిచ్చిన దాతలపేర్లను రాయించారని సమాచారం. ఇదిలా ఉంటే.. ఇటావాలో మరొక ఆశ్రమ నిర్మాణం కూడా చేపట్టారు. ఇంకా తవ్వితే భోలే బాబాకు ఎన్ని ఆస్తులున్నాయో, ఎంతమంది బినామీలుగా ఉన్నారో, ఆయన ఎవరికి బినామీగా ఉన్నారో కూడా తెలిసే అవకాశాలు లేకపోలేదు.

# బోడకాకర కాయతో భలే ప్రయోజనాలు

-ఎన్నో వ్యాధులకు చెక్... బోడ కాకరకాయ ఉపయోగాలు తెలుసుకుందాం

కాకరకాయ జాతికి చెందినదే ఆకాకరకాయ. దీనిని అడవి కాకరకాయ, లేదా బోడ కాకరకాయలు అంటారు. కాకరకాయల మాదిరిగా పొడుగ్గా కాకుండా రౌండ్ గా ఉండి..చిన్న చిన్న బొడిపలుంటాయి. అయితే దీని ఖరీదు కాస్త ఎక్కువనే చెప్పాలి. ఇవి జూలై, ఆగస్టు, సెప్టెబంర్ మాసంలో ఎక్కువగా దొరకుతాయి. ఆ కాకరకాయను ఆహారంలో తీసుకోవం వలన మధుమేహం, గుండె జబ్బులతో పాటు అధిక బరువు సమస్యను కూడా తగ్గించుకోవచ్చు అని చెబుతుంటారు. బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే డయాబెటిక్ పేషంట్లకు సైతం బోడకాకర ఎంతో మంచిది. ముఖ్యంగా రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించడంలో బోడకాకర ఉపయోగపడుతుంది. బోడ కాకరకాయ సీజన్ వచ్చిందంటే చాలు చాలామంది దీని కూర చేసుకొని తినేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. దీన్ని కొన్ని ప్రాంతాల్లో 'ఆకాకరకాయ' అని కూడా పిలుస్తారు. ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో సేకరించే ఈ కాయ వర్షాకాలంలో విరివిగా లభిస్తుంది. ఎంత ధరైనా సరే వెచ్చించి తినేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్లో బోడకాకర కాయ ధర కిలో.300 నుండి 400 రూపాయలపైన పలికినా కస్టమర్లు కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. బోడకాకరతో పులుసు, వేపుడు కూర, పొడి చేసుకునేందుకు భోజన ప్రియులు ఇష్టపడతారు. కేవలం రెండు, మూడు నెలలు మాత్రమే లభించే బోడకాకరను గిరిజనులు అడవిలో సేకరించి మార్కెట్లో దళారులకు అమ్ముతుంటారు. ఇక బోడ కాకరలో పోషక విలువలతో పాటు ఔషధ విలువల కూడా మెండుగా ఉంటాయి. ముఖ్యంగా బోడకాకరతో పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు అధిక మోతాదులో ఉంటాయి. అలాగే దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. బోడకాకరలో ఫోలేట్స్ అధికశాతం ఉంటాయి. దీని వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు గర్భిణులు ఈ కాయను కూర చేసుకొని తింటే గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతుంది. అలాగే డయాబెటిక్ పేషంట్లకు సైతం బోడకాకర ఎంతో మంచిది. ముఖ్యంగా రక్తంలోని చక్కెర నిల్వలను తగ్గించడంలో బోడకాకర ఉపయోగపడుతుంది. ఇందులోని కెరోటినాయడ్స్ కంటి సంబంధిత వ్యాధుల నివారణకు ఉపకరిస్తుంది. అలాగే క్యాన్సర్ సహా ఇతర ఇన్ఫెక్షన్ల బారిన పడగకుండా కూడా ఈ కాయ రక్షిస్తుంది. ఇక చివరగా ఇందులోని ఫ్లవనాయిడ్లు వయస్సు మీరి వచ్చే ముడతలను నియంత్రిస్తాయి.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**